DD9 వాస్తవాలు పలుకు

TGTEL/26/A2635

వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 126 | 17-09-2026 | గురువారం | పేజీలు: 10 | వెల: 3/-

పబ్లిసిటీ పీక్స్.. పని మాత్రం జీరో!





శ్రీదేవి ఆస్తిపై స్టేటస్ కో

- చెన్నై ఆస్తి వివాదం సుప్రీంకోర్టుకు
- ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని స్థలంపై కేసు
- తదుపరి విచారణ వరకు స్టేటస్ కో కొనసాగింపు
- వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచన
- 1988లో 4.77 ఎకరాల స్థలం కొనుగోలు చేసిన శ్రీదేవి
- ఆస్తిలో వాటా ఉందంటూ ముదలియార్ రెండో భార్య పిల్లల పిటిషన్



'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్ఓసీ ఆరోపణ
- గంగుల కమలాకర్ భూములపైనా మంత్రి వ్యాఖ్యలు
- 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి
- 47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి



యూపీఐ ఛార్జీలపై విదేశీ ఒత్తిడి లేదు

- యూపీఐ ఎండీఆర్ విధింపుపై విపక్షాల విమర్శలు
- విదేశీ ఒత్తిళ్లేవీ లేవని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టీకరణ
- ఎండీఆర్‌పై నిర్ణయం స్వతంత్రంగా తీసుకున్నదేనని వెల్లడి
- ఆర్థికంగా నిలదొక్కుకునే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థే లక్ష్యం
- అందరికీ అందుబాటులో ఉండే వ్యవస్థ కోసం కొత్త విధానం
- రూ.2 వేలలోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలు లేవు
- రూ.2 వేలకుపైగా నిర్దిష్ట లావాదేవీలకు 0.4 శాతం ఎండీఆర్



నా భూములపై సీబీఐతో విచారణ జరిపించండి

- 22ఏ భూములపై సీఎం అబద్ధాలు చెప్పారని కవిత ఆరోపణ
- అసెంబ్లీలో తన భూములపై రేవంత్ ప్రస్తావన
- సిద్ధిపేటలో 37.26 ఎకరాలున్నాయని సీఎం వ్యాఖ్య
- 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి ప్రకటనపై కవిత స్పందన
- పలువురి భూములపై సమగ్ర విచారణకు డిమాండ్
- సీబీఐతో దర్యాప్తు జరిపించి నిజాలు తేల్చాలని కోరిన కవిత
- నవీన్‌రావు నుంచి పైలెట్ రోహిత్‌రెడ్డి వరకు పేర్ల ప్రస్తావన
- ఎన్నికల అఫిడవిట్ వివరాలతోనూ విచారణ జరపాలని డిమాండ్
- నిబంధనలకు మించి ఒక్క గజం ఉన్నా సరెండర్ చేస్తానని వెల్లడి
- తన భూములపై మరోసారి స్పష్టత ఇచ్చిన కవిత

హైదరాబాద్, (డీడీ9 వార్త):

శాసనసభలో 22ఏ భూములపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత విమర్శించారు. సిద్ధిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరుతో 37.26 ఎకరాల భూమి ఉందని అసెంబ్లీలో సీఎం పేర్కొన్న విషయంపై ఆమె స్పందించారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి ప్రకటనపై కవిత తన అభిప్రాయాలను వెల్లడించారు.

అందరి భూములపై సీబీఐ విచారణ

సీఎం అసెంబ్లీలో ప్రస్తావించిన భూముల వివరాలపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. నవీన్‌రావు, కొండల్‌రావు, గంగుల కమలాకర్, మిగతా 2 లో..

సీఎం చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు

- 22ఏ భూములపై సీఎం వ్యాఖ్యలను ఖండించిన హరీశ్‌రావు
- కాంగ్రెస్ అక్రమాలు బయటపడతాయనే భయంతోనే సస్పెన్షన్
- రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- సభలో ప్రతిపక్షం లేకుండా ప్రజా సమస్యల నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపణ
- 22ఏపై బీఆర్ఎస్ పోరాటం నిజమని సీఎం ప్రసంగంతో తేలిందన్న హరీశ్
- 3 లక్షల ఎకరాల సమస్య 30 లక్షల ఎకరాలకు పెరిగిందని వ్యాఖ్య
- కలెక్టర్ల పాత జాబితాలతోనే 22ఏలో భూములు చేర్చారన్న ఆరోపణ
- సీఎం ఇంటిని 22ఏ నుంచి తొలగించినట్లే ప్రజల భూములనూ తొలగించాలని డిమాండ్
- మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్
- భూభారతిలో అక్రమ లావాదేవీలు, చలాన్ల స్కామ్‌పై ఆరోపణలు



హైదరాబాద్, (డీడీ9 వార్త):

22ఏ భూములపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అక్రమాలు బయటపడతాయనే భయంతోనే తమను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మిగతా 2 లో..

పార్క్ వద్ద కరెన్సీ నోట్ల కుప్ప..!

- సెంట్రల్ పార్క్ వద్ద నోట్ల కట్టలు
- చినిగిపోయిన నోట్లు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చిన వాకర్స్
- రూ.500, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లు లభ్యం
- నోట్లతో పాటు పలు పత్రాలూ గుర్తింపు
- ఒకే చోట ఇంత మొత్తంలో నోట్లు పడేయడంపై ఆసక్తి
- సీసీటీవీ ఫుటేజీతో నిందితుడిని గుర్తించిన పోలీసులు
- కేజీహెచ్ ప్రాంతానికి చెందిన ఆదిమూలం సూర్యారావుగా గుర్తింపు
- చెదలు పట్టడంతో నోట్లు పనికిరావని భావించిన వ్యక్తి
- అట్టపెట్టెలో డబ్బులు, ఎల్ఐసీ రశీదులు దాచిన సూర్యారావు
- నోట్లు, పత్రాలను తిరిగి అందజేసిన పోలీసులు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

నగరంలోని సెంట్రల్ పార్క్ వద్ద కరెన్సీ నోట్ల కుప్పగా పడి ఉండటం కలకలం రేపింది. పార్క్ ఎదురుగా పెద్ద మొత్తంలో చినిగిపోయిన కరెన్సీ నోట్లు పడి ఉండటాన్ని వాకర్స్ గుర్తించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నోట్లను పరిశీలించారు. రూ.500, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లతో పాటు కొన్ని పత్రాలు అక్కడ కనిపించాయి. ఒకే చోట ఇంత మొత్తంలో చినిగిపోయిన కరెన్సీ నోట్లను ఎవరు మిగతా 2 లో..



భూ పోరాటాలు చేసింది కమ్యూనిస్టులే

- 1945 నుంచే పోరాటం
- ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు తీవ్ర నష్టం
- 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలు బయటకు తీయాలి
- భూముల వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా భూములపై సమగ్ర పరిశీలన
- ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు వెల్లడించాలని డిమాండ్
- భూదాన్ భూములపై ఫారెన్సిక్ ఆడిట్ చేయాలని సూచన
- నిజాం కాలం నాటి సర్ఫ్‌ఖాన్ భూములు ఏమయ్యాయని ప్రశ్న
- 22ఏలో సాంకేతిక తప్పిదం జరిగిందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని వ్యాఖ్య
- ఈ వ్యవహారంలో మంత్రులు, అధికారుల పాత్రపై విచారణకు డిమాండ్



హైదరాబాద్, (డీడీ9 వార్త):

22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో జరిగిన చర్చలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని ఆయన అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు భూమి కోసం పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ధరణిలో జరిగిన తప్పిదాల మిగతా 2లో..

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

- 30 రోజుల్లో ఎంక్వైరీ పూర్తి చేయాలని ఆదేశం
- 700 ఎకరాల భూమి అంశంపై పూర్తి స్థాయిలో పరిశీలన
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న సీఎం
- ప్రభుత్వ భూమిని పేదలకు పంచుతామని రేవంత్ ప్రకటన
- ధరణి అక్రమాలపై త్వరలో పార్ట్-2 బయటపెడతామని వెల్లడి
- రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల భూ కుంభకోణం జరిగిందన్న ఆరోపణ
- భూ కుంభకోణంపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేస్తామని ప్రకటన
- 22ఏ భూముల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ
- వారం రోజుల్లో 22ఏ సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలు
- జీవో 118 పరిధిలోని 9,500 మంది బాధితులకు త్వరలో పరిష్కారం



హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణలో భూముల వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా? లేదా? అనే అంశాన్ని తేల్చాలని అధికారులను ఆదేశించినట్లు అసెంబ్లీలో వెల్లడించారు. 30 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.


ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని సీఎం ఆరోపించారు. ఈ విషయం గురించి కేసీఆర్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. విచారణలో ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేలితే.. ఆ భూమిని పేదలకు పంచిపెడతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

కల్వకుంట్ల కుటుంబం భూములపై ప్రస్తావన

అసెంబ్లీలో భూముల అంశంపై మాట్లాడిన సీఎం.. సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి ఉన్న భూముల వివరాలను ప్రస్తావించారు. కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. అలాగే జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి తొమ్మిది జిల్లాల్లోని 24 మండలాలు, 31 గ్రామాల్లో కలిపి 439 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు.కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్ అంశాన్ని కూడా మిగతా 2 లో..

ఓటుకు నోటు కేసుపై సుప్రీంకోర్టులో విచారణ

- రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య పిటిషన్లపై విచారణ
- ఏసీబీ కేసు చెల్లదన్న పిటిషనర్ల తరపు న్యాయవాదులు
- ఎన్నికల వ్యవహారంలో ఏసీబీకి అధికారం లేదని వాదన
- కేసును అవినీతి, లంచం
- వ్యవహారంగా చూడొద్దని అభ్యర్థన
- 2021లో కేసు నమోదైన సమయంలోని
- చట్టాలను ప్రస్తావించిన న్యాయవాదులు
- అప్పటి నిబంధనల ప్రకారం
- ఏసీబీ జోక్యానికి అవకాశం లేదని వాదన
- లంచం ఇవ్వడం నేరం కాదని పిటిషనర్ల వాదన
- జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని
- త్రిసభ్య ధర్మాసనం విచారణ
- పాత ధర్మాసనంలోని న్యాయమూర్తులు
- పదవీ విరమణతో కొత్త బెంచ్
- తదుపరి విచారణ తేదీని రిజిస్ట్రీ ఖరారు చేయనుంది



హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తెలంగాణ సీఎం ఎ. రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా ధర్మాసనంలో మిగతా 2 లో..

సీఎం చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు

మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. సభలో ప్రతిపక్షం లేకుండా చేసి ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా తప్పించుకుంటున్నారని అన్నారు.

22ఏపై బీఆర్ఎస్ పోరాటం నిజమే

22ఏ భూముల విషయంలో బీఆర్ఎస్ గత కొంతకాలంగా చేస్తున్న పోరాటం అక్షర సత్యమని హరీశ్‌రావు అన్నారు. 22ఏ భూముల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం శాసనసభ సాక్షిగా తేటతెల్లమైందని పేర్కొన్నారు.

మూడు లక్షల ఎకరాల సమస్య 30 లక్షల ఎకరాలకు పెరిగిపోయిందని సీఎం చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. కలెక్టర్లు పాత జాబితాలను అప్‌లోడ్ చేయడంతోనే 30 లక్షల ఎకరాలు 22ఏ జాబితాలో చేరాయని సీఎం చెబుతున్నారని అన్నారు. అయితే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి మాత్రం ఒక్క ఎకరం కూడా చేర్చలేదని చెప్పారని గుర్తుచేశారు.

ప్రజల భూములూ తొలగించాలి

22ఏ జాబితా నుంచి సీఎం ఇంటిని రాత్రికి రాత్రే తొలగించారని హరీశ్‌రావు ఆరోపించారు. అదే విధంగా 22ఏ జాబితాలో చేరిన ప్రజల భూములను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని, ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేశారని హరీశ్‌రావు విమర్శించారు. 22ఏ తప్పును సరిచేయాల్సిన పాలకులు విపక్షంపై ఎదురుదాడికి దిగుతున్నారని అన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపితే తమపై వ్యక్తిగతంగా ఎదురుదాడి చేస్తున్నారని ఆరోపించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

22ఏ భూముల మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని తాము కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదన్నారు. తాము ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన ఆస్తుల వివరాలనే సీఎం ఇప్పుడు ప్రస్తావించారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

భూభారతిపై ఆరోపణలు

భూభారతిలో రూ.80 లక్షల విలువైన చలాన్ల స్కామ్ జరిగిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఒక్క జిల్లాలోనే రూ.80 లక్షల చలాన్ల స్కామ్ జరిగితే ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. భూభారతి ద్వారా ప్రజలకు తెలియకుండానే ఒకరి ఆస్తి మరొకరికి బదిలీ అయిందని ఆరోపించారు.

భూ పోరాటాలు చేసింది కమ్యూనిస్టులే

మొదటిపేజీ తరువాయి

కారణంగా ప్రజలకు చాలా నష్టం జరిగిందని కూనంనేని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూములకు సంబంధించిన వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

భూముల వివరాలు బయటపెట్టాలి

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కూనంనేని కోరారు. భూదాన్ భూముల వ్యవహారంపై ఫొరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.

నిజాం హయాంలో సర్‌ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. ఆ భూముల వివరాలను వెలికితీస్తే స్థలం లేని వారికి వాటిని అందించే అవకాశం ఉంటుందని అన్నారు.

22ఏపై సమగ్ర విచారణ

22ఏ నిషేధిత భూముల విషయంలో జరిగిన పరిణామాలను సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. అయితే ఈ వ్యవహారంలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంతమేర ఉందో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. 22ఏ భూముల వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించి బాధ్యులను గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నా భూములపై సీబీఐతో విచారణ జరిపించండి

మొదటిపేజీ తరువాయి

ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, ప్రతిమ శ్రీనివాస్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి తదితరుల భూములపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు.

ఈ విచారణ ద్వారా వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఆమె డిమాండ్ చేశారు.

'ఒక్క గజం ఎక్కువ ఉన్నా సరెండర్ చేస్తా'

తన కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్లు సీఎం చెప్పారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు మించి తనకు ఒక్క గజం భూమి ఎక్కువగా ఉన్నా ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని స్పష్టం చేశారు.

ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భూముల కంటే అదనంగా ఒక్క గజం ఉన్నట్లు తేలినా ప్రభుత్వానికే అప్పగిస్తానని మరోసారి స్పష్టం చేశారు. తన భూములకు సంబంధించిన అంశంపై విచారణ జరిపించి వాస్తవాలను తేల్చాలని కవిత కోరారు.

ఓటుకు నోటు కేసుపై సుప్రీంకోర్టులో విచారణ

మొదటిపేజీ తరువాయి

సభ్యులుగా ఉన్నారు.

తమపై నమోదైన ఏసీబీ కేసు చెల్లదని రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఎన్నికలకు సంబంధించినదని, దీనిపై విచారణ జరిపే అధికారం ఏసీబీకి లేదని వారి తరఫు న్యాయవాదులు వాదించారు. కేసును అవినీతి, లంచం వ్యవహారంగా కాకుండా ఎన్నికల కేసుగా పరిగణించాలని కోరారు.

అప్పటి చట్టాలపై వాదనలు

2021లో కేసు నమోదైన సమయంలో అమల్లో ఉన్న చట్టాలను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ప్రస్తావించారు. అప్పటి నిబంధనల ప్రకారం ఎన్నికల వ్యవహారంలో ఏసీబీ జోక్యం చేసుకునే అధికారం లేదని వాదించారు. అప్పటి చట్టం ప్రకారం లంచం ఇవ్వడం నేరం కాదని కూడా పిటిషన్‌లో పేర్కొన్న విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

కొత్త ధర్మాసనం ముందుకు కేసు

ఓటుకు నోటు కేసుపై గతంలో పలుమార్లు విచారణ జరిగింది. అయితే అప్పటి ధర్మాసనంలోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో ప్రస్తుత త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బుధవారం విచారణ ముగిసింది. తదుపరి విచారణ తేదీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఖరారు చేయనుంది.

శ్రీదేవి ఆస్తిపై స్టేటస్ కో

- **సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**
- **చెన్నై ఆస్తి వివాదం సుప్రీంకోర్టుకు**
- **ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని స్థలంపై కేసు**
- **తదుపరి విచారణ వరకు స్టేటస్ కో కొనసాగింపు**
- **వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచన**
- **1988లో 4.77 ఎకరాల స్థలం కొనుగోలు చేసిన శ్రీదేవి**
- **ఆస్తిలో వాటా ఉందంటూ ముదలియార్ రెండో భార్య పిల్లల పిటిషన్**
- **శివగామి సివిల్ కేసును కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు**
- **హైకోర్టు తీర్పును సవాల్ చేసిన శివగామి**
- **మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారానికి సుప్రీంకోర్టు సూచన**
- **తదుపరి విచారణ డిసెంబర్ 18కి వాయిదా**

హైదరాబాద్, (డీడీ9 వార్త):

దివంగత నటి శ్రీదేవికి సంబంధించిన చెన్నై ఆస్తి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారం తాజాగా సుప్రీంకోర్టుకు చేరింది. చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని స్థలంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణ వరకు యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని ఆదేశించింది. ఆస్తి వివాదాన్ని ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించింది.

1988లో స్థలం కొనుగోలు

శ్రీదేవి 1988లో చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులో 4.77 ఎకరాల స్థలాన్ని ముదలియార్ అనే వ్యక్తి కుటుంబం నుంచి కొనుగోలు చేశారు. దశాబ్దాలుగా ఈ ఆస్తి శ్రీదేవి కుటుంబం ఆధీనంలోనే ఉంది. ఆమె మరణం తర్వాత 2023లో ఆస్తి మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

అయితే ముదలియార్ రెండో భార్య పిల్లలైన ఎం.సి. శివగామి, ఆమె సోదరుడు ఈ ఆస్తిలో తమకూ వాటా ఉందని పేర్కొంటూ చెంగల్పట్టు కోర్టులో సివిల్ కేసు దాఖలు చేశారు.

మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన కపూర్ కుటుంబం

ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ముదలియార్ మొదటి భార్య ప్రాణాలతో ఉండగానే రెండో వివాహం చేసుకున్నారని.. అందువల్ల రెండో భార్య పిల్లలకు చట్టపరంగా వారసత్వ హక్కులు ఉండవని వారు వాదించారు.


కపూర్ కుటుంబం వాదనలతో ఏకీభవించిన మద్రాస్ హైకోర్టు.. కింది కోర్టు తీర్పులో జోక్యం చేసుకుంటూ శివగామి దాఖలు చేసిన సివిల్ కేసును కొట్టివేసింది.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన శివగామి

మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ శివగామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు ప్రాథమిక దశలో ఉండగానే హైకోర్టు లోతుగా విచారణ జరిపిందని (మినీట్రయల్) ఆమె తరఫు న్యాయవాది వాదించారు. కపూర్ కుటుంబం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. 1988లో జరిగిన ఆస్తి కొనుగోలుపై ఇన్నేళ్ల తర్వాత, 2025లో కేసు వేయడం సరికాదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్లు 1995, 1999లోనే మేజర్లు అయ్యారని గుర్తుచేశారు.

మధ్యవర్తిత్వానికి సుప్రీంకోర్టు సూచన

ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. ఇందుకోసం ఓ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తిని నియమిస్తామని తెలిపింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. అప్పటివరకు ఆస్తిపై యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది.



కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

మొదటిపేజీ తరువాయి

సీఎం ప్రస్తావించారు. ''కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్‌పై నేనెందుకు బాంబులు వేస్తా?'' అంటూ వ్యాఖ్యానించారు. గతంలో స్టీఫెన్‌సన్‌కు ఎన్నికల ముందు నజరానా ఇచ్చారని ఆరోపించారు. రూ.50 కోట్ల విలువైన భూమిని రూ.1.53 కోట్లకే రెగ్యులరైజ్ చేశారని పేర్కొన్నారు.

పలువురి భూములపై ఆరోపణలు

గంగుల, ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డికి సంబంధించి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు వ్యవహారం ఉందని సీఎం ఆరోపించారు. జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఒక కుటుంబానికి కుష్మి భూమి 54 ఎకరాలు, తరి భూమి 27 ఎకరాల వరకు ఉండాలని నిబంధనలు చెబుతున్నాయని, కేసీఆర్‌కు ఉన్న భూమి మొత్తం తరి పొలమేనని సీఎం వ్యాఖ్యానించారు.

ధరణి పార్ట్-2పై ప్రకటన

రాష్ట్రంలో మొత్తం రూ.లక్ష కోట్ల భూ కుంభకోణం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. భూ కుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ) ఏర్పాటు చేస్తామని తెలిపారు. మొత్తం వ్యవహారంపై నెల రోజుల్లో నిగ్గు తేలుస్తామని చెప్పారు.

ఇప్పటివరకు వెల్లడించింది ధరణి పార్ట్1 మాత్రమేనని, త్వరలో ధరణి పార్ట్2 అక్రమాలను బయటపెడతామని ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్ని వివరాలను వెల్లడిస్తామని అన్నారు. తదుపరి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు హాజరయ్యేలా స్పీకర్ చూడాలని కోరారు.

టీజీఐఐసీ భూములపైనా విచారణ

టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సమావేశాల్లో బయటపెడతామని సీఎం తెలిపారు. ధరణిని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. భూముల వ్యవహారంలో జరిగిన అక్రమాలపై సమగ్రంగా దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు.

22ఏ భూముల సమస్యలపై కమిటీ

22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి హైపవర్ అధికారుల కమిటీని ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారానికి వారంలోపు సమగ్ర మార్గదర్శకాలు తీసుకొస్తామని చెప్పారు.

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ లేఔట్లకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చే దరఖాస్తులను కూడా పరిష్కరిస్తామని వెల్లడించారు.

జీవో 118పై కీలక ప్రకటన

ఎల్బీనగర్‌లో జీవో 118 పరిధిలో ఉన్నవారికి త్వరలో శుభవార్త చెబుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజక వర్గంలోని స్థలాలను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించారు. జీవో 118 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో సుమారు 9,500 మంది బాధితులు ఉన్నారని సీఎం పేర్కొన్నారు. వారి సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

యూపీఐ ఛార్జీలపై విదేశీ ఒత్తిడి లేదు

- **యూపీఐ ఎండీఆర్ విధింపుపై విపక్షాల విమర్శలు**
- **విదేశీ ఒత్తిళ్లేవీ లేవని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టీకరణ**
- **ఎండీఆర్‌పై నిర్ణయం స్వతంత్రంగా తీసుకున్నదేనని వెల్లడి**
- **ఆర్థికంగా నిలదొక్కుకునే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థే లక్ష్యం**
- **అందరికీ అందుబాటులో ఉండే వ్యవస్థ కోసం కొత్త విధానం**
- **రూ.2 వేలలోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలు లేవు**
- **రూ.2 వేలకుపైగా నిర్దిష్ట లావాదేవీలకు 0.4 శాతం ఎండీఆర్**
- **అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి**
- **పీ2పీ, రూ.2 వేలలోపు పీ2ఎం లావాదేవీలకు మినహాయింపు**
- **'యూపీఐ ట్యాక్స్' అంటూ రాహుల్‌గాంధీ విమర్శలు**

హైదరాబాద్, (డీడీ9 వార్త):

యూపీఐ లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించడంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు కేంద్ర ప్రభుత్వం స్పందించింది. యూపీఐ ఛార్జీల నిర్ణయం వెనుక ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్ని స్వతంత్రంగా తీసుకున్నామని తెలిపింది. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను సృష్టించడమే కొత్త విధానం వెనుక ఉన్న లక్ష్యమని పేర్కొంది. స్వయం సమృద్ధి, సమ్మిళితమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేయడానికే ఈ విధానాన్ని రూపొందించినట్లు వివరించింది.

రూ.2 వేలలోపు ఛార్జీలు లేవు

రూ.2 వేలలోపు యూపీఐ లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలు విధించబోమని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. రూ.2 వేలకుపైగా జరిగే నిర్దిష్ట లావాదేవీలకు మాత్రం 0.4 శాతం ఎండీఆర్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ఛార్జీలు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి.

అదే సమయంలో వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు (పీ2పీ), రూ.2 వేలలోపు వ్యాపార చెల్లింపులు (పీ2ఎం) ఎండీఆర్ పరిధిలోకి రావని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.

కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

యూపీఐ ఛార్జీల నిర్ణయంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. భారత్‌లో అమల్లో ఉన్న జీరో ఎండీఆర్ విధానాన్ని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటి నుంచో వ్యతిరేకిస్తున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ మార్పు చేసిందని విమర్శించింది.

'యూపీఐ ట్యాక్స్' అంటూ రాహుల్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా యూపీఐ ఛార్జీలపై విమర్శలు చేశారు. కొత్త ఛార్జీలను 'యూపీఐ ట్యాక్స్'గా అభివర్ణించారు. ఈ మేరకు వీడియో సందేశాన్ని విడుదల చేశారు.


మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్.. ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు తలవంచుతున్నారని విమర్శించారు. ప్రతి భారతీయుడిపై యూపీఐ ట్యాక్స్ విధించి ఆ డబ్బును అమెరికాకు ఇస్తున్నారని ఆరోపించారు.

అమెరికా ముందు తలవంచడం ఆపి ధైర్యంగా నిటారుగా నిలబడాలని మోదీని కోరారు. యూపీఐ ట్యాక్స్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'నోటా'పైనా కాంగ్రెస్ వ్యాఖ్యలు

యూపీఐ ఛార్జీల అంశంపై కాంగ్రెస్ మరోసారి కేంద్రంపై విమర్శలు చేసింది. 'నరేంద్ర మోదీ ట్రంప్ ను ప్రసన్నం చేసుకొనే వైఖరి' అంటూ కొత్త అర్థాన్ని ఇచ్చింది.

యూపీఐ లావాదేవీలపై గతంలో ఉన్నట్లుగానే ఛార్జీలు లేకుండా చూడాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరింది.



పార్క్ వద్ద కరెన్సీ నోట్ల కుప్ప..!

మొదటిపేజీ తరువాయి

పడేశారన్నది ఆసక్తికరంగా మారింది.

సీసీటీవీతో అసలు విషయం వెలుగులోకి

వాకర్స్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఈ క్రమంలో కేజీహెచ్ ప్రాంతంలోని తాడివీధికి చెందిన ఆదిమూలం సూర్యారావు నోట్లను అక్కడ పడేసినట్లు గుర్తించారు.

చెదలు పట్టడంతో పడేశాడు

పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యారావు దుకాణాలకు కిరాణా సరుకులు సరఫరా చేస్తుంటారు. ఆయన ఇంట్లోని ఓ అట్టపెట్టెలో డబ్బులు, ఎల్ఐసీ రశీదులు దాచి పెట్టారు. అయితే ఆ పెట్టెకు చెదలు పట్టడంతో అందులోని డబ్బులు, పత్రాలు పనికిరావని భావించారు. దీంతో చినిగిపోయిన కరెన్సీ నోట్లు, పత్రాలను సెంట్రల్ పార్క్ వద్ద పడేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నోట్ల కుప్ప వెనుక ఎలాంటి అనుమానాస్పద వ్యవహారం లేదని దర్యాప్తులో తేలింది.

సూర్యారావుకు నోట్లు, పత్రాలు అప్పగింత

ఘటనపై దర్యాప్తు చేసిన సీఐ అప్పలనాయుడు.. కరెన్సీ నోట్లతో పాటు ఎల్ఐసీ రశీదులు, పాన్ కార్డును సూర్యారావుకు అందజేశారు. పార్క్ వద్ద కరెన్సీ నోట్ల కుప్ప కనిపించడంతో కలకలం రేగగా.. సీసీటీవీ పరిశీలనతో అసలు విషయం బయటపడింది.

'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?

- **అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు**
- **పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్ఓసీ ఆరోపణ**
- **గంగుల కమలాకర్ భూములపైనా మంత్రి వ్యాఖ్యలు**
- **22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి**
- **47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి**

హైదరాబాద్, (డీడీ9 వార్త):

మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. ''అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?'' అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక భరోసా

- **ముత్యాలరావు వైద్యానికి రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరు**
- **నిరుపేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

భద్రాచలం, సెప్టెంబరు 16 (డిడి9 వార్త)

అనారోగ్యంతో బాధపడుతున్న వాజేడు మండలం చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన బోల్లె ముత్యాలరావుకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు భరోసాగా నిలిచారు. తీవ్రమైన న్యూరో సమస్యతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్యాలరావు కుటుంబం.. తమ దయనీయ పరిస్థితిని వివరిస్తూ ఆర్థిక సాయం కోరగా ఎమ్మెల్యే వెంటనే స్పందించారు.

ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి రత్నం రమాకాంత్ చేతుల మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. కష్టకాలంలో తమ కుటుంబానికి కొండంత అండగా నిలిచి, తక్షణ ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు ముత్యాలరావు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, నర్రా రాము, గాడి విజయ్, వార్డు సభ్యుడు దుర్గారావు, సుభాని, కొప్పుల వంశీ, ఏలూరి రాము తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.





ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- **అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు అందిస్తాం: ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు**

వాజేడు, సెప్టెంబర్ 16 (డీడీ9 వార్త):

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు అన్నారు. బుధవారం వాజేడు మండలంలో పర్యటించిన ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృపాకర్, డీటీ రాంసింగ్, ఆర్ఐ కుమారస్వామి, వివిధ పంచాయతీల సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమించాలి

- **సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ దావూద్**
- **మండల కార్యదర్శి జాగటి చిన్నా**

మంగపేట సెప్టెంబర్16డీడీ9 వార్త

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజలందరూ తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ దావూద్ పిలుపునిచ్చారు. మంగపేట మండల కేంద్రంలోని సొసైటీ హాల్‌లో బుధవారం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి జాగటి చిన్నా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎండీ దావూద్ పాల్గొని మాట్లాడారు.


1946 నుంచి 1951 వరకు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం జమీందారీ, భూస్వామ్య విధానాలతో పాటు నైజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని దావూద్ వివరించారు. ఆనాటి కాలంలో ప్రజలకు పౌర హక్కులు, స్వేచ్ఛగా సమావేశాలు నిర్వహించుకునే అవకాశం, సభలు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులు కూడా లేకపోయేవని గుర్తుచేశారు.

దోపిడీ, పెత్తందారుల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించి, ఎన్నో త్యాగాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారని అన్నారు. ఆనాటి పోరాటం ఫలితంగానే భూస్వామ్య, జమీందారీ వ్యవస్థలపై మార్పులు వచ్చాయని పేర్కొన్నారు.

మండల కార్యదర్శి జాగటి చిన్నా మాట్లాడుతూ దోపిడీ, పెత్తందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యమై పోరాడారని అన్నారు. ఈ పోరాటంలో సుమారు 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది ప్రజలు త్యాగాలు చేశారని పేర్కొన్నారు. పోరాట ఫలితంగా సుమారు 3 వేల గ్రామాలు విముక్తి పొందాయని, ప్రజలు తమ పంట పొలాలపై తిరిగి హక్కులు సాధించుకున్నారని తెలిపారు.

"బండి ఎనక బండి గట్టి.. 16 బండ్లు కట్టి.. ఏ బండ్ల పోతావ్ కొడుకో నిజాం సర్కరో డా..." వంటి నినాదాలతో ప్రజలు పోరాట స్ఫూర్తిని చాటారని గుర్తుచేశారు. ఆనాటి పోరాటం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు. వీరమరణం పొందిన ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను అధికార పార్టీలు తమకు అనుకూలంగా వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదని సీపీఎం నాయకులు విమర్శించారు. చరిత్రను వాస్తవాల ఆధారంగా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఎల్పీ ముత్యాలు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య తదితరులు పోషించిన పాత్రను ఎప్పటికీ మరువలేమన్నారు. వారి పోరాట స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై కూడా ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాలను కోరారు. ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమిస్తే హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు నర్రా శివప్రసాద్, ఎల్పీ ముత్యాలు, జగన్మోహన్ రెడ్డి, టీ ఏజీఎస్ మండల అధ్యక్షులు కురుసం చిరంజీవి, మండల నాయకులు గొడదాసు, మంగయ్య, కురుసం సంతోష్, నందు తదితరులు పాల్గొన్నారు. సుమారు 40 మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.







అశ్వారావుపేటలో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా...

- **అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు అశ్వారావుపేట మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు...**

అశ్వరావుపేట:సెప్టెంబర్ 16(డి డి 9 వార్త)

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో వంటిపల్లి నరసింహారావు తండ్రి వంటిపల్లి రాజేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వారిని పరామర్శించారు... అనంతరం సీమకుర్తి శ్రీరంగం సతీమణి కమల అలాగే జల్లిపల్లి లోకనాథ్ గుప్తా తల్లి పద్మావతి ఇటీవల మృతి చెందడంతో వారి చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వినాయకపురం(గ్రామం) లో ఇటీవల మృతి చెందిన భూక్యా భిక్షం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అదే గ్రామానికి చెందిన లైన్‌మెన్ గొట్టిముక్కల శ్యాంసన్ గుండెపోటుతో మృతి చెందడంతో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నెమలిపేట(గ్రామం)లో ఆదివాసీ నాయకులు పాయం దుర్గారావు ఇటీవల మృతి చెందడంతో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వడ్డేరంగాపురం(గ్రామం)లో మాజీ ఎంపీటీసీ తిరుపతిరావు మేనల్లుడు గుంజి వెంకన్నబాబు ఇటీవల మృతి చెందడంతో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ జూపల్లి రమణారావు,మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి , మోహన్‌రెడ్డి ,యుఎస్ ప్రకాశ్‌రావు , ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు సంక ప్రసాద్ ,ధర్మ , చిన్నంశెట్టి నరసింహం , చందా లక్ష్మీనర్సయ్య , మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్ ,మడి నాగేశ్వరరావు ,ఉస్మాన్ , అబ్దుల్ రెహ్మాన్ ,కుర్సం వెంకటేష్ , సాయిల శేఖర్ ,డేరంగుల వెంకయ్య , గిరి , డేరంగుల వెంకటేష్ , చిప్పనపల్లి శ్రీను , బన్ను తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





పబ్లిసిటీ పీక్స్.. పని మాత్రం జీరో!

- **నర్సింహాసాగర్ పంచాయతీ ఇంచార్జి సెక్రెటరీ వెంకటరమణ తీరుపై గ్రామస్థుల ఆగ్రహం**

మంగపేట సెప్టెంబర్ 16డీడీ9 వార్త

నర్సింహాసాగర్ గ్రామ పంచాయతీ ఇంచార్జి సెక్రెటరీ వెంకటరమణ తీరుపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఇంచార్జి బాధ్యతలు చేపట్టి సుమారు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భాలు కనిపించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తున్నామంటూ టీవీ ఛానళ్లలో ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని వారు మండిపడుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం.. పట్టించుకునేవారు కరువు

గ్రామంలోని పలు వీధుల్లో మురుగు కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోతుందని, వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దీంతో దోమల బెడద పెరుగుతోందని, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగ్గింగ్ నిర్వహించడం వంటి చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు.

వెలగని వీధి దీపాలు.. రాత్రివేళ ఇబ్బందులు

గ్రామంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తగిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని వారు వాపోతున్నారు.

పంచాయతీ సిబ్బందిపై కూడా పరిశీలన చేయాలి

పంచాయతీ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఇంటి పన్నుల సొమ్ము పంచాయతీ ఖాతాలో నిబంధనల ప్రకారం జమ అవుతుందా? పంచాయతీ నిధులు, ఆదాయ వ్యయాల నిర్వహణ ఎలా ఉంది? తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే పంచాయతీ రికార్డులను ఆడిట్ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రచారాలకు కాకుండా క్షేత్రస్థాయి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కేవలం ప్రచారాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇంచార్జి సెక్రెటరీ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, పారిశుధ్యం, వీధి దీపాలు, మురుగు కాలువలు తదితర సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నర్సింహాసాగర్ గ్రామ పంచాయతీ పనితీరుపై సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీ నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. తమ ఆరోపణలపై అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఏదైనా నిర్లక్ష్యం లేదా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.







బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

- **విద్యుత్ షాక్, పిడుగుపాటు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ఆర్థిక సాయం**


వాజేడు, సెప్టెంబర్ 16 (డీడీ9 వార్త):

ఇటీవల వివిధ ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో మృతి చెందిన, బాధిత కుటుంబాలను భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇటీవల పేరూరు గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన తుమ్మ అభిషేక్, పంది సమ్మయ్య కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అదే ఘటనలో గాయపడిన పోశెట్టి సురేష్ కుటుంబాన్ని కూడా పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

అదేవిధంగా రాంపురం గ్రామానికి చెందిన యువకుడు పసుపులేటి సురేందర్ మృతి చెందిన కుటుంబాన్ని, వాజేడు నాగారం గ్రామానికి చెందిన ఆలం చంటి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబాన్ని పరామర్శించారు. చింతూరు గ్రామానికి చెందిన ములకల ఆనందరావు పిడుగుపాటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కూడా పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం కింద ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు.బాధిత కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని,ప్రభుత్వపరంగా అందాల్సిన సంక్షేమ పథకాలు, సహాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ బాబు, ములుగు జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు చెన్నం ఎల్లయ్య, సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాధరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే కాజావలి, ఆదినారాయణ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గౌరారపు సర్వేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు రమేష్, కాకర్లపూడి కళ్యాణ్, కాళీ కృష్ణ, సర్పంచుల సంఘం అధ్యక్షులు బోధబోయిన భరత్ కుమార్, వివిధ పంచాయతీల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం కేటాయించాలి

- **మంగపేట తహసీల్దార్‌కు రజక కులస్తుల వినతి**

మంగపేట,సెప్టెంబర్ 16డీడీ9 వార్త

తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) విగ్రహ ప్రతిష్ఠాపన కోసం మంగపేట మండల కేంద్రంలో స్థలం కేటాయించాలని కోరుతూ రజక కులస్తులు బుధవారం మంగపేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.


మంగపేట మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం కేటాయించాలని కోరుతూ రజక కులస్తులు గతంలోనూ పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు సంబంధిత అధికారులు స్థలం కేటాయింపుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో నిజాం పాలనకు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరవనితగా చాకలి ఐలమ్మ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని రజక సంఘం నాయకులు తెలిపారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

చాకలి ఐలమ్మ వంటి మహనీయురాలి సేవలను స్మరించుకోవడం, ఆమెకు తగిన గౌరవం కల్పించడం ప్రజలతో పాటు ప్రభుత్వ బాధ్యత అని వారు అన్నారు. ఈ నేపథ్యంలో మంగపేట మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి, విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని అధికారులను కోరారు.

విగ్రహ స్థలం కేటాయింపు విషయంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రజక కులస్తులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రజక సంఘం మంగపేట మండల అధ్యక్షుడు నూతలకంటి రాజు, కార్యదర్శి గణేష్ రాచకొండ, తాడి రమణ, చలమయ్య, లింగమూర్తి, మహిళా అధ్యక్షురాలు పుణ్యం నాగలక్ష్మి, రమాదేవి, రాధికతో పాటు పలువురు రజక కులస్తులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి..

- **అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా.. అనర్హుల పేర్లు జాబితాలోకి రాకుండా చూడాలి.**
- **ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేయాలి.**
- **110- పినపాక నియోజకవర్గం ఈఆర్ఓ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్.**

మణుగూరు. సెప్టెంబర్ 16(డి డి 9వార్త)

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని పినపాక నియోజకవర్గం
ఈ ఆర్ ఓ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత తాసిల్దార్లకు ఆదేశించారు. బుధవారం నాడు మణుగూరు లోని సమితి సింగారం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించిన అనంతరం మణుగూరు తాసిల్దార్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సర్ ఓటర్ నమోదు ప్రక్రియ పై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లకు నోటీసుల జారీ, నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసులు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన, క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు.
అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, అనర్హులైన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల మేరకు సమగ్ర పరిశీలన నిర్వహించాలని ఆయన సూచించారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి ఆ హక్కు లభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
నోటీసు అందజేసిన అనంతరం సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) తప్పనిసరిగా అందజేసినట్లు రసీదును యాప్‌లో నమోదు చేయాలని, రసీదు వివరాలు యాప్‌లో నమోదు చేసిన తర్వాతనే సంబంధిత నోటీసు అందజేత పూర్తయినట్లుగా పరిగణించాలని పేర్కొన్నారు. మిగిలిన నోటీసుల పంపిణీపై క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి, ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

పినపాక నియోజకవర్గంలో434 మందికి

విచారణకు పిలిచిన వారిలో దాదాపు 60 శాతం మంది హాజరవుతుండగా, హాజరవుతున్న వారిలో 30 నుంచి 40 శాతం మంది సరైన ధ్రువపత్రాలు లేకుండా వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈ నేపథ్యంలో విచారణ తేదీకి ముందుగానే సంబంధిత ఓటర్లకు సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని ఆయన సూచించారు. ఓటర్లు అవసరమైన పత్రాలతో విచారణకు హాజరయ్యేలా బీఎల్ఓలు, బీఎల్ఏల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.
బీఎల్ఓలు, బీఎల్ఏలు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి ఇంటినీ సందర్శించి, సంబంధిత ఓటర్లకు అవసరమైన ధ్రువపత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన సహకారం అందించేలా బీఎల్ఓల పనితీరును అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.
పుట్టిన తేదీ, వయస్సు తదితర వివరాల నిర్ధారణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువపత్రాలను ఓటర్లు సమర్పించేలా అధికారులు
బి ఎల్ వో లకు సూచించాలని, ఓటరు పేరు లేదా ఇతర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో తగిన ఆధారాలు అందుబాటులో లేనట్లయితే, నిబంధనల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన, పంచనామా తదితర అవసరమైన ప్రక్రియలను





చేపట్టాలని సూచించారు.
అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు నిరాకరించబడకుండా చూడటంతో పాటు, అర్హత లేని వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఓటర్ల పేర్ల తొలగింపుకు సంబంధించిన ప్రతి కేసును నిబంధనల మేరకు సమగ్రంగా పరిశీలించి, కారణాలను స్పష్టంగా నమోదు చేస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు.
ఈ సమావేశంలో మణుగూరు తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఎలక్షన్ డ్యూటీలు అనూష, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం..

- **యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలి.**
- **పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి.**
- **శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి.**
- **AISF భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్.**

మణుగూరు. సెప్టెంబర్ 16(డి డి 9వార్త)

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలనిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
మణుగూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని పేర్కొన్నారు. దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లోమా విద్య అందకుండా పోతుందని అజిత్ ఆవేదన వ్యక్తం చేశారు.పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యార్థులను విద్యకు మరింత దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందనీ, పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 ను ఉప సవరించుకోవాలని, ఆయన సూచించారు. రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్ గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గ ఉప సంఘం పచ్చ జెండా ఊపింది. కానీ ఆ తర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారని ఐటీ పరిశ్రమలు శాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూనివర్సిటీని సాంకేతిక విద్యా శాఖ పరిధిలోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా ముందడుగు వేయలేదని తాజాగా ఐటిఐలు ఏటీసీలు పాలి



టెక్నిక్ కళాశాల ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలనే సర్కార్ ఆలోచన విధానం సరికాదని, దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతు ఉంటే అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం చూస్తూ ఊరుకోనేదే లేదని అజిత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ఇలాంటి నిర్ణయాలను వెనుకకు తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతారని, కానీ నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకుల భర్తీ, ల్యాబ్ ల ఆధునికీకరణ, వర్క్ షాపులు నిర్వహణ, మరియు హాస్టల్ ను అభివృద్ధి చేయాలి. కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గూగుల్ యువరాజ్, కృష్ణ సాయి, అజయ్, వంశీ, మహేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో
పోరాటాలు ఉధృతం చేయాలి

తాడ్వాయిడిడి9 వార్త

సూడి కృష్ణారెడ్డి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు
ఎస్,ఎస్ తాడ్వాయి మండలంలోని పడిగాపూర్ గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దుగ్గి చిరంజీవి అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించడం జరిగింది. సూడి కృష్ణారెడ్డి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.ఎస్ తాడ్వాయి మండలంలోని పడిగాపూర్ గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దుగ్గి చిరంజీవి అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించడం జరిగింది.
ఈసభకు ముఖ్య అతిథిగా సూడి కృష్ణారెడ్డి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూమి కొరకు భుక్తి కొరకు వెట్టిచాకిరి విముక్తి కొరకు 1946 నుండి1951 వరకు పేద ప్రజలు సాగించిన పోరాటమని ఇది భూస్వాములకు రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సుదీర్ఘ పోరాటమని ఈ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమి పేద ప్రజలకు పంచిందని 3000 గ్రామాలను విముక్తి చేసి గ్రామ స్వరాజ్యాలు ఏర్పడ్డాయని ఈ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు అమరులయ్యారని పేర్కొన్నారు ఇలాంటి పోరాటాన్ని ఈపోరాటంలో ఎలాంటి సంబంధం లేని బిజెపి ఈరోజు వక్రీకరించి నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా అంటే ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా అభివర్ణించి మత ప్రాతిపదిక మీద ఈ పోరాటాన్ని విమోచన దినంగా పేర్కొంటున్నది పాలక పార్టీలు ఈ పోరాటాన్ని విలీన దినంగా పాటిస్తున్నారు కమ్యూనిస్టులు మాత్రమే ఈపోరాటాన్ని అమరవీల స్ఫూర్తితో వార్షికోత్సవ సభలు నిర్వహిస్తున్నారు పేర్కొన్నారు ఈ పోరాటంలో హిందూ భూస్వాములకు వ్యతిరేకంగా షేక్ బందగి మొయినుద్దీన్ లాంటి ముస్లింలు కూడా పాల్గొన్నారు అని ఇది కేవలం వెట్టిచాకిరికి భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమని పేర్కొన్నారు నేటికీ పాలకులు స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాల పూర్తయిన పేదలకు భూమి పంచలేదని 2005 అటవీ యొక్క చట్టం అమలు కొరకు పోరాటాలు నిర్వహించామని ఇంకా జిల్లాలో వేలాది మందికి హక్కు పత్రాలు రాలేదని ఈప్రభుత్వం అందరికీ హక్కులు కల్పిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిందని పేర్కొన్నారు హక్కు పత్రాలు వచ్చేదాకా పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సిన అవసరం ఉన్నది.కౌలుదారులకు రక్షణ లేదని దేశంలో మహిళలకు రక్షణ లేదని పేర్కొన్నారు అందుకే సిపిఎం పార్టీ కార్యకర్తలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటస్ఫూర్తితో ప్రతి కార్యకర్త పోరాటాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి రెడ్డి సాంబశివ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు పొదిల్ల చిట్టిబాబు సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యుల సోమమల్లారెడ్డి అల్లెం అశోక్ ఉకే ప్రభాకర్ అంబాల మురళి కురసం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

మన ఇంటికి–మన బాత్‌రూమ్

- **ప్రతి ఇంటికి మరుగుదొడ్డి.. ఆరోగ్యకరమైన కుటుంబానికి తొలి అడుగు**


వాజేడు, సెప్టెంబర్ 16 (డీడీ9 వార్త):

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని ఆరుగుంటపల్లి గ్రామంలో కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ఇజిఎ - పారిశుధ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాపేడు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లుద్రు రాజు ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి కుటుంబ సభ్యుడి బాధ్యత అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా ప్రతి ఇంటిలో సురక్షితమైన మరుగుదొడ్డిని నిర్మించుకొని, దానిని క్రమం తప్పకుండా వినియోగించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా మార్చుకోవచ్చని తెలిపారు.
మరుగుదొడ్డి వినియోగం వల్ల వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంతో పాటు మహిళలు, పిల్లలు, వృద్ధులకు భద్రత, గౌరవం లభిస్తుందని వివరించారు. “మన ఇంటికి.. మన బాత్‌రూమ్, మన గ్రామం.. మన పరిశుభ్రత, పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్షణ” అనే నినాదాలతో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రామ ప్రజలు పాటించాల్సినవి

* ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలి.
* మరుగుదొడ్డిని ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలి.
* బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నివారించాలి.
* మరుగుదొడ్డి ఉపయోగించిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
* ఇంటి పరిసరాల్లో చెత్త, మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.


గ్రామంలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పరిశుభ్రమైన పరిసరాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.
ఈ కార్యక్రమంలో ఎఫ్.ఏ. రాంబాబు, వెంకటాపురం మండల సమన్వయకర్త గొంది హనుమంతు, వాజేడు మండల సమన్వయకర్త గొంది కామేశ్వరరావు, యానిమేటర్లు సిహెచ్. భాస్కర్, సిహెచ్. రమాదేవి, దీపిక రాణి, పొడెం స్వరూప, కే. ప్రసాద్, గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం మండల విద్యుత్ వినియోగదారులకు లోకల్ కోర్టు ఏర్పాటు

- **18/09/2026న ఏమైనా ఫిర్యాదులు ఉంటే వ్రాతపూర్వకంగా ఇవ్వండి**
- **TGNPDCL విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ కే దామోదర్ రావు**

సెప్టెంబర్ 16 డీడీ 9 వార్త దుమ్ముగూడెం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో గల 33/11kv దుమ్ముగూడెం సబ్ స్టేషన్ కార్యాలయం ఆవరణలో 18/09/2026నాడులోకల్ కోర్ట్ ఏర్పాటు చేసినట్లు TGNPDCL విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ కే దామోదర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లను మార్చడం వోల్టేజ్ హెచ్చుతగ్గులు డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల లోపాలు ఉన్నమీటర్లను మార్చడం నూతన సర్వీసులు మంజూరు అదనపు లోడు క్రమబద్ధీకరణ సర్వీస్ పేరు మార్పు వాడకానికన్నా హెచ్ మొత్తంలో గల బిల్లులు కేటగిరి మార్పు సర్వీస్ రద్దు మొదలగు వాటి సంబంధించి విద్యుత్ వినియోగదారులు వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చునని తెలిపారు. ఫిర్యాదులు ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల వరకు స్వీకరించబడునని అన్నారు. కావున TGNPDCL విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని ఫోరం చైర్పర్సన్ కే దామోదర్ రావు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం చేసిన... లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు సభ్యులు.

మణుగూరు. సెప్టెంబర్ 16(డి డి 9వార్త)

మణుగూరు మండలం, సుందరయ్య నగర్ గ్రామానికి చెందిన.. చిరు వ్యాపారం చేసుకునే యస్.సత్యనారాయణ గత కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యం చేయించుకోవడానికి కూడా ఆర్థిక స్తోమత లేని అత్యంత దయనీయస్థితిలో ఉన్న వారికి లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు సభ్యులు అండగా నిలిచి వారికి సుమారు 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ ఆర్థిక సహాయానికి సహకరించిన దాతలు: లయన్ బేతంచర్ల వెంకటేశ్వరావు 5000/, మైలవరం గ్రామానికి చెందిన మారెమల్ల నాగేశ్వరావు 5000/, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దొబ్బల వెంకటప్పయ్య 1000/, ముత్తంశెట్టి నాగేశ్వరావు 1000/ నగదు రూపంలో సహాయం అందజేశారు.
లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ప్రెసిడెంట్ దొబ్బల వెంకటప్పయ్య చేతులమీదుగా అందజేయడమైనది.ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు సభ్యులు Ln బేతంచర్ల వెంకటేశ్వర్లు, Ln ముత్తంశెట్టి నాగేశ్వర రావు, వెంకట్ రెడ్డి అలాగే మణుగూరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.



షైన్ హై స్కూల్ పై ఆరోపణలకు పుచ్చకాయల నాగేశ్వరరావు ప్రేరణ


- **నాగేశ్వరరావుని నమ్మి విద్యాశాఖకు పిర్యాదులు .....**
- **ఇతర యాజమాన్యంతో కుమ్మక్కై తమను ఉపయోగించుకున్నారని ఆరోపణ..**
- **మాయమాటలతో తమను ప్రేరేపించారని టీచర్ల వెల్లడి..**

బోనకల్,సెప్టెంబర్ 16,(డీడీ9 వార్త):

షైన్ హైస్కూల్ యాజమాన్యంపై గతంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గతంలో అక్కడ పనిచేసిన పాఠశాల ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్యకు తాము చేసిన ఆరోపణల పై బుధవారం ఉపసంహరణ ఇచ్చారు. తాము అప్పటి తెలుగు ఉపాధ్యాయుడు మరియు హెడ్ మాస్టర్ గా పనిచేసిన పుచ్చకాయల నాగేశ్వరరావు చెప్పిన మాటలను నమ్మిన ఆరోపణలు చేశామని టీచర్లు తమ వివరణలో పేర్కొన్నారు.
షైన్ హైస్కూల్‌పై మరియు పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సార్ పాషాపై గతంలో పాఠశాలలో టీచర్‌గా మరియు హెడ్‌మాస్టర్ ఉన్న పి.నాగేశ్వర్‌రావుతో పాటు పనిచేసిన సుమారు 10 మంది ఉపాధ్యాయులు కూడా అప్పటి ఫిర్యాదులో భాగమయ్యారు. పాఠశాలపై మరియు యాజమాన్యంపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందనీ కానీ అవి కేవలం పి నాగేశ్వరరావే 10 మంది టీచర్స్ తీసుకొని యాజమాన్యంపై ఆరోపణలు చేసే పరిస్థితి తీసుకువచ్చారని అంతేకాకుండా,ఇతర యాజమాన్యంతో కుమ్మక్కై తమను ఉపయోగించుకున్నారని టీచర్లు ఆరోపించినట్లు సమాచారం.

"విద్యార్థుల భవిష్యత్‌ను కూడా ఆలోచించలేదు"

పి నాగేశ్వరరావు పాఠశాల యాజమాన్యం పై బురదచల్లేలా తమను ప్రేరేపించారని,ఆ సమయంలో విద్యార్థుల భవిష్యత్‌పై కూడా తాము సరైన ఆలోచన చేయలేకపోయామని ఉపాధ్యాయులు ఎంఈఓకు వివరించినట్లు తెలుస్తోంది.వాస్తవాలు పూర్తిగా తెలుసుకోకుండా ఒకరి మాటలను నమ్మడం తమ తప్పిదమని వారు పేర్కొన్నారు.ఒక పాఠశాలపై ఆరోపణలు చేసి,దానిపై చర్యలు తీసుకోవాలని లేదా పాఠశాలను మూసివేయాలని కోరినప్పుడు దాని ప్రభావం యాజమాన్యంపై మాత్రమే ఉండదు. అక్కడ చదువుతున్న విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు వారి కుటుంబాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది.విద్యా సంవత్సరం మధ్యలో పాఠశాలను విడిచిపెట్టడం, ఇతర ఉపాధ్యాయుల్లో కూడా అనిశ్చితి ఏర్పడటం వంటి పరిణామాలు విద్యార్థుల చదువుపై ప్రభావం చూపితే, దాని బాధ్యత గురించి కూడా ఆలోచించాల్సిన బాధ్యత హెడ్ మాస్టర్ పై ఉంటుంది.కానీ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి కళంకం తీసుకురావడం సరికాదని "టీచర్ వృత్తి ఒక సాధారణ ఉద్యోగం కాదనీ అది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యతనీ విద్యావేత్తలు అంటున్నారు.ఈ ఉప సంహరణ విషయం ఎవరినీ అవమానించడనీకి కాదని కేవలం విద్యార్థుల తల్లితండ్రులలో ఏర్పడిన అపోహలను తొలగించి,అందుబాటులోకి వచ్చిన కొత్త వాస్తవాలను ముందుంచడం మాత్రమేనని అక్కడ పని చేసి వెళ్ళిన ఉపాధ్యాయులు పేర్కొన్నారు.తాము గతంలో చేసిన పిర్యాదులన్నిటిని వాపస్ తీసుకుంటున్నామని పిర్యాదులో తెలియజేశారు.





సుభాష్ నగర్‌లో ఘనంగా మహా అన్నప్రసాదం

గుండాల, సెప్టెంబర్ 16 (డిడి 9వార్త).

గుండాల మండలంలోని సుభాష్ నగర్‌లో వరసిద్ధి వినాయక స్వామి మండపం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.
ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా జరిగింది.
దాతలుగా ముందుకొచ్చిన గడ్డం రాంబాబు-సుజాత, వైష్ణవి, వర్షిత కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు.
వారి సహకారానికి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.
పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.
అనంతరం నిర్వహించిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.
అన్నదానం ప్రజల్లో సేవాభావం, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో యువత, చిన్నారులు భక్తులకు సేవలందించారు.ఈ కార్యక్రమంలో గుండాల ఎస్ఐ శ్రవణ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్తలు మానాల ప్రభాకర్, మానాల ప్రణీత్, తిరుక్కోవల్లూరి వెంకటేశ్వర్లు, పాత్రికేయులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

జనగామబొట్ల చిలుకమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ నాయకులు

జనగామ సెప్టెంబర్16(డిడి9) వార్త

జనగామ జిల్లా కేంద్రంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ మాతృమూర్తి బొట్ల చిలుకమ్మ మృతి చెందారు. వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వారిలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు మంద సాయిలు రమేష్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్యాణం చంద్రమౌళి, పాస్టర్ పి ఫిలిప్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం సమ్మయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బొట్ల విజయ్, కాంగ్రెస్ పార్టీ యశ్వంతపూర్ గ్రామ అధ్యక్షుడు బాల్నె నరేష్ గౌడ్, బొల్లం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో ఘనంగా ప్రపంచ బార్బర్స్ డే వేడుకలు

- **నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**
- **ఐక్యత, వృత్తిపరమైన అభివృద్ధికి పెద్దపీట వేయాలని పిలుపు.**

భద్రాచలం టౌన్ , సెప్టెంబర్ 16 (డిడి9 వార్త)

ప్రపంచ బార్బర్స్ డేను పురస్కరించుకుని భద్రాచలం టౌన్‌లో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. టౌన్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు జంపాల ప్రభాకర్ అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.
నాయి బ్రాహ్మణులంతా సమాజంలో ఐక్యతతో ముందుకు సాగాలని, సంఘటిత శక్తి ద్వారానే వృత్తిపరమైన అభివృద్ధి, సామాజిక సేవ సాధ్యమవుతాయని నాయకులు ఉద్ఘాటించారు. వృత్తిని గౌరవిస్తూనే ఆధునిక పోకడలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర శ్రీను, భద్రాచలం టౌన్ గౌరవ అధ్యక్షుడు మార్కాపురం వెంకన్న, అడ్డగూడూరు సత్యనారాయణ, టౌన్ ప్రధాన కార్యదర్శి సోమనపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి ఎల్లమందల ఉపేందర్ పాల్గొన్నారు. అలాగే భద్రాచలం డివిజన్ గౌరవ అధ్యక్షుడు మార్కాపురం సీతారాములు, డివిజన్ అధ్యక్షుడు అనుదుర్తి క్రాంతి, వర్కింగ్ ప్రెసిడెంట్ అందుర్తి రాజకుమార్, ఉపాధ్యక్షుడు కేటి వెంకట్, సహాయ కార్యదర్శి కొండేటి పెద్దిరాజు, అందుర్తి సాయి తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.లక్ష విరాళం

భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 16 (డిడీ 9 వార్త)

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.లక్ష విరాళంను పాల్వంచకు చెందిన జరగబన వెంకన్న దరి బుధవారం అందజేశారు. అలాగే రామాలయంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



రెవెన్యూ అధికారుల మౌనమే అక్రమార్కులకు అండగా మారిందా..?

- **శీతకుంట భూకబ్జా,గోవిందాపూర్ మొరందందా,తహరాపూర్ గోకుంటలో మట్టి తవ్వకాలు వరుస ఘటనలపై తీవ్ర చర్చ**
- **అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణమా..?**
- **ఫిర్యాదులు వస్తున్నా చర్యలు ఎందుకు కనిపించవు..?అక్రమాలకు అడ్డుకట్ట ఎక్కడ..?**
- **అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల్లో అనుమానాలు**
- **గోగుంట మట్టి తవ్వకాలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు పేరుకేనా...? చెర్యలు ఎప్పుడు..?**
- **వరుసగా జరుగుతున్న దందాలపై తెరదించాలంటే క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి..**
- **రెవిన్యూ అధికారులపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలన్న అభిప్రాయాలు**

శాయంపేట,సెప్టెంబర్ 16, డి డి 9వార్త

హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలో వరుసగా వెలుగుచూస్తున్న భూ,మట్టి అక్రమాలపై రెవెన్యూ అధికారుల తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఒకటి కాదు.. రెండు కాదు.. శీతకుంట భూకబ్జా, గోవిందాపూర్ మొరందందా, తహరాపూర్ గోగుంటలో మట్టి తవ్వకాలు..ఇలా ఒక్కో అక్రమం వెలుగులోకి వస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎందుకు స్పందించడం లేదన్నది చర్చనీయాంశంగా మారింది. శీతకుంట భూకబ్జా.. గోవిందాపూర్ మొరం దందా.. తహరాపూర్ మట్టి దందా.. ఇలా చెబుతూ పోతే ఇంకెన్ని అక్రమాలు..?ప్రభుత్వ భూములు, చెరువులు,గుంటలు,సహజ వనరులపై అక్రమార్కుల కన్ను పడుతున్నా అధికార యంత్రాంగం కదలకపోవడం వెనుక కారణమేంటి అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నా.. వాటిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు వంటి ప్రక్రియలు ఎందుకు వేగంగా సాగడం లేదన్నది ప్రజలకు సమాధానం కావాల్సిన ప్రశ్నగా మారింది.రెవెన్యూ అధికారుల కళ్లను నోట్ల కట్టలతో కమ్మేస్తున్నారా..? అక్రమార్కులపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.నిజంగా ఎక్కడైనా అధికారుల నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం ఉన్నట్లయితే ఉన్నతాధికారులు బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోలీస్‌స్టేషన్‌లో జీపీఓ మోహన్ ఇచ్చిన ఫిర్యాదు పేరుకేనా..?

మండలం లోని తహరాపూర్ గోగుంటలో మట్టి తవ్వకాలపై కొన్ని రోజుల క్రితం గ్రామ పంచాయతీ తరపున జీ పి ఓ మోహన్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు పేపర్ ను అనుమతి పేపర్ అని అబద్దం చెప్పి మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు తదుపరి చర్యలపై స్పష్టత లేకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.పోలీస్‌స్టేషన్‌లో జీపీఓ ఇచ్చిన ఫిర్యాదు పేరుకేనా..?ఫిర్యాదు స్వీకరించడం మాత్రమే కాకుండా.. అక్రమ తవ్వకాలు జరిగాయా..? అనుమతులు ఉన్నాయా..? ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించారా..? అనే అంశాలపై సంబంధిత శాఖలు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించి చెర్యలు తీసుకోకుండా వదిలేయడం తో మళ్ళీ అదే కుంటలో బరితెగించిన అక్రమార్కులు తవ్వకాలు జరపడం అధికారులే ఉసిగొల్పినట్టుగా వాదనలు వినిపిస్తున్నాయి.

రెవిన్యూ అధికారులపై కలెక్టర్ దృష్టి పెట్టకపోవడమే ఈ అక్రమాలకు మూలమా..?

మండలంలో వరుసగా ఆరోపణలు, ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు తీసుకున్న చర్యలు ఏమిటి..? ఎన్ని ఫిర్యాదులపై విచారణ జరిగింది..? అక్రమాలు నిర్ధారణ అయితే ఎవరిపై చర్యలు తీసుకున్నారు..? అనే వివరాలను జిల్లా యంత్రాంగం ప్రజలకు వెల్లడించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన రెవిన్యూ అధికారులే మౌనం వహిస్తే.. అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని,అధికారికంగా స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, గుంటలు,సహజ వనరుల పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జనగామతెలంగాణ సాయుధ పోరాట యోధుడు.. జనగామ సింహం నల్లా నరసింహులు గారి 100వ జయంతి ఉత్సవాలకు సన్నాహక సమావేశం

జనగామ సెప్టెంబర్16(డిడి9) వార్త

జనగామఅక్టోబర్ 2న ఘనంగా 100వ జయంతి ఉత్సవాలు - ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలి: కటకం నర్సింగ్ రావు

జనగామ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, జనగామ సింహం నల్లా నరసింహులు గారి 100వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జనగామలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అక్టోబర్ 2, 2026న నిర్వహించనున్న 100వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి కమిటీని ఏర్పాటు చేశారు.
తెలంగాణ విముక్తి కోసం జీవితాంతం పోరాడిన నల్లా నరసింహులు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని సమావేశంలో పేర్కొన్నారు. 1945-1951 మధ్య కాలంలో నిజాం ప్రభుత్వ అండతో రజాకార్లు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు తదితరుల దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటంలో నల్లా నరసింహులు గారు అనేక త్యాగాలు చేశారని గుర్తు చేశారు
అప్పటి కాలంలో వెట్టి చాకిరీ, భూస్వాముల దోపిడీ, పేద రైతాంగంపై అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటానికి నాయకత్వం వహించిన యోధుల్లో నల్లా నరసింహులు ప్రముఖులని సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ విముక్తి పోరాటంలో ఆయనతో పాటు అనేక మంది యోధులు అరెస్టులు, చిత్రహింసలు, జైలు శిక్షలను ఎదుర్కొని ప్రజల కోసం త్యాగాలు చేశారని తెలిపారు.
నల్లా నరసింహులు శతజయంతి సందర్భంగా ఆయన పోరాట చరిత్ర, త్యాగాలు, తెలంగాణ ప్రజా ఉద్యమానికి చేసిన సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ, నల్లా నరసింహులు 100వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాలకు చెందిన నల్లా నరసింహులు అభిమానులు, ప్రజలు, ఉద్యమాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.
ఈ సన్నాహక సమావేశంలో మాస్ రాష్ట్ర కార్యదర్శి గునిగంటి చంద్రశేఖర్ గౌడ్, నల్ల అరుణ, దాసరి జనార్దన్, బల్ల రవీంద్రనాథ్, దోర్నాల వెంకన్న, కందుల కృష్ణ, మంతెన వీరనర్సయ్య, వంగ రామస్వామి, మాచర్ల సరయ్య, పసునూరి మధుసూదన్, ఆడేరు బాలస్వామి, వంగ రవి, బండారి ఏకనాథం, బొమ్మ రఘురామ్ నేత, గాడిపల్లి సక్కుబాయ్ తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న నల్లా నరసింహులు 100వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.





చిరుతపులి చర్మం, అవశేషాలు స్వాధీనం

- **ఆరుగురు నిందితుల అరెస్ట్.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 16 (డిడి9 వార్త):

చర్ల అటవీ రేంజ్ పరిధిలో చిరుతపులి చర్మం, శరీర అవశేషాలను అక్రమంగా తరలించి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురిని భద్రాచలం అటవీ డివిజన్ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చిరుతపులి చర్మంతో పాటు గోళ్లు, పళ్లు, పుర్రెను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.
అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల మండలం కుర్నపల్లి గ్రామంలో వన్యప్రాణి నేరానికి సంబంధించిన సమాచారం సెప్టెంబరు 15న మధ్యాహ్నం 1.05 గంటల సమయంలో అందింది. దీంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చిరుతపులి చర్మం, శరీర అవశేషాలు ఉన్నట్లు గుర్తించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.
అరెస్టయిన వారిలో కుర్నపల్లికి చెందిన కోరుం నారాయణ (నర్సయ్య కుమారుడు), కిష్టారంపాడుకు చెందిన పోడియం దేవేందర్ (భీమయ్య కుమారుడు), బెస్తకొత్తూరుకు చెందిన అల్లం సాయికిరణ్ (సుబ్బయ్య కుమారుడు), గంగోని గూడెంకు చెందిన జలకర రాధాకృష్ణ (పాపయ్య కుమారుడు), కిష్టారంపాడుకు చెందిన పోడియం సంతోష్ (భీమయ్య కుమారుడు), డిల్లే బండి (గంగ కుమారుడు) ఉన్నారు.
వారి నుంచి ఒక చిరుతపులి చర్మం, తొమ్మిది గోళ్లు, ఆరు పళ్లు, ఒక చిరుతపులి పుర్రె/తల స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. చిరుతపులి వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం షెడ్యూల్ 1లో రక్షిత జంతువుగా ఉందని పేర్కొన్నారు.
ఈ ఘటనపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద పీహెచ్ఆర్ నంబర్ 909/01తో కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

పూర్తి వివరాలపై దర్యాప్తు

చిరుతపులి వేటకు సంబంధించిన పూర్తి వివరాలను వెలికితీసేందుకు సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని భద్రాచలం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) నిషా ఎస్.ఎన్., ఐఎఫ్ఎస్ తెలిపారు. వన్యప్రాణులను వేటాడటం, వాటి అవశేషాలను అక్రమంగా రవాణా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



ప్రీ-ప్రైమరీలో 30కి ఎన్‌రోల్‌మెంట్ పెంచుతాం

- **19వ తేదీలోగా విద్యార్థుల సంఖ్య పెంచుతామని తల్లిదండ్రులు, ఉపాధ్యాయురాలి హామీ**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 16 (డిడి9 వార్త)

తాతగుడి సెంటర్‌లో నూతనంగా ప్రారంభించిన ప్రీప్రైమరీ కేంద్రంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రంలోగా విద్యార్థుల సంఖ్యను 30కి పెంచి చూపిస్తామని తల్లిదండ్రులు, ఉపాధ్యాయురాలు శిరీష మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు.
ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించి, మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.
బుధవారం భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ, మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావుతో కలిసి తాతగుడి సెంటర్‌లోని పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి పాఠశాలకు అందిన విద్యార్థుల ఏకరూప దుస్తులు, బెల్టులు, టైలు, పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.
అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వసతులను పరిశీలించారు. ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.



అటవీ భూములపై అక్రమార్కుల కన్ను అధికారుల నిఘా ఏది..?

- ఫారెస్ట్ అధికారుల మౌనంపై అనుమానాలెన్నో..?
- ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు 20 ఎకరాలు చదును చేస్తున్నా చోద్యం చూస్తున్నారా..?
- సూర్య నాయక్ తండాలో అటవీ భూముల చదునుపై ఆంతర్యమేంటి..?
- దోషులను గుర్తించామంటూ ప్రకటనలు.. అసలు దోషులపై చర్యలు ఎప్పుడు..?
- చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం..?
- ఇకనైనా అధికారుల మౌనానికి తెరపడేనా..?

శాయంపేట,సెప్టెంబర్ 16,డి డి 9వార్త

అటవీ భూముల రక్షణకు కాపలా కాయాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు ఇప్పుడు హన్మకొండ జిల్లా శాయంపేట మండలం సూర్య నాయక్ తండా పరిసరాల్లో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు..దాదాపు 20 ఎకరాల మేర అటవీ భూమిని యంత్రాలతో చదును చేసినా సంబంధిత అధికారులు ముందస్తుగా ఎందుకు అడ్డుకోలేకపోయారన్నది చర్చనీయాంశంగా మారింది. అక్రమార్కులకు అంత ధైర్యం ఎలా వచ్చింది..?అటవీ భూముల్లో యంత్రాలు ప్రవేశించి పెద్ద ఎత్తున భూమిని చదును చేసే స్థాయికి పరిస్థితి చేరుకునే వరకు అధికారుల నిఘా వ్యవస్థ ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సర్పంచ్ భర్త నే ఇదంతా నడిపిస్తున్నాడా..? అతనితో అధికారులకు ఏ రకమైన సాన్నిహిత్యం..అటవీ ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాల్సిన చోట ఇంత విస్తీర్ణంలో భూమి చదును జరుగుతుంటే అధికారులు గుర్తించలేదా...? లేక గుర్తించినా పట్టించుకోలేదా..? అనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.అటవీ భూముల చదునుకు సంబంధించి అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టాయంటూ కొందరు ఆరోపణలు చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ఉన్న తాధికారులదే.నిజంగా ఎవరైనా అక్రమాలకు సహకరించారా..? ఎవరి ప్రోత్సాహంతో ఈ పని సాగింది.? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.



చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం..?

భూమి చదును పూర్తయిన తర్వాత "దోషులను గుర్తించాం" అంటూ అధికారులు చెప్పడం వల్ల అటవీ భూమికి జరిగిన నష్టం పూడ్చబడుతుందా..? చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం..?ముందుగానే అక్రమాన్ని అడ్డుకోలేకపోయి, నష్టం జరిగిన తర్వాత చర్యలకు దిగితే ప్రయోజనం ఏమిటన్న విమర్శలు వినిపిస్తున్నాయి.అక్రమంగా భూమిని చదును చేసిన ప్రాంతాన్ని పునరుద్ధరించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల మౌనానికి తెరపడేనా..?

అటవీ భూములను కాపాడాల్సిన వ్యవస్థలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే భవిష్యత్తులో మరింత విస్తృతంగా అక్రమాలు జరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూర్య నాయక్ తండాలో దాదాపు 20 ఎకరాల భూమి చదునుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి,సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.అక్రమంగా భూమిని చదును చేసిన వారెవరు...? యంత్రాలను ఎవరు అనుమతించారు..? అధికారుల పర్యవేక్షణ ఎక్కడ విఫలమైంది..? ఆరోపణలు నిజమైతే ముడుపుల వ్యవహారంలో ఎవరి పాత్ర ఉంది..? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యతలో నిర్లక్ష్యం లేదా అక్రమ సహకారం ఏదైనా ఉంటే, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా మేడారానికి కీర్తి ప్రతిష్ఠలు..!

- ఆదివాసీ సంస్కృతి,సంప్రదాయం, అస్తిత్వానికి ప్రతీక మేడారం
- ప్రపంచ దేశాలు గర్వించదగిన సమ్మక్క–సారలమ్మల మహాజాతర
- ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందానికి ఘనస్వాగతం పలికిన దేవాదాయ అధికారులు
- గద్దెలపై ప్రత్యేక పూజలు.. మేడారం విశిష్టత, జాతర అభివృద్ధిని వివరించిన అధికారులు, పూజారులు

ఏటూరునాగారం క్రైం, డి డి 9 వార్త, సెప్టెంబర్ 16:

ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మల గద్దెలను ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది.ప్రపంచంలోనే మేడారం సమ్మక్క-సారలమ్మల మహాజాతరకు ప్రత్యేక కీర్తి,ప్రతిష్ఠలు ఉన్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పేర్కొంది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం,ఆచార వ్యవహారాలు, అస్తిత్వానికి మేడారం మహాజాతర ప్రతీకగా నిలుస్తోందని వారు అభిప్రాయపడ్డారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం మేడారం పర్యటనకు వస్తున్న విషయం ముందుగానే తెలియడంతో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు. మేడారం ఈఓకు సమాచారం అందించడంతో పూజారులు,దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మేడారం ఆర్చీ గేటు వద్దకు చేరుకున్న ప్రతినిధుల బృందానికి పూజారులు, అధికారులు,సిబ్బంది ఘనస్వాగతం పలికారు.డోలు వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. ఆ సమయంలో ఆర్చీ గేటు భక్తులతో సందడిగా కనిపించింది.



గద్దెలపై ప్రత్యేక పూజలు..!

ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం సమ్మక్క-సారలమ్మల గద్దెలపై పూజారులు,దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.పసుపు, కుంకుమ,చీరె,సారెలను సమర్పించి మొక్కులు చెల్లించారు.సమ్మక్క, సారలమ్మతో పాటు పగిడిద్దరాజు,గోవిందరాజులకు కూడా ప్రత్యేక పూజలు చేశారు.సమ్మక్క పూజారులు దేవతల ప్రసాదాలను సమర్పించారు. అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందాన్ని సంప్రదాయబద్ధంగా శాలువాలతో సన్మానించారు. మేడారం గద్దెల ప్రాంగణం విశిష్టత,అక్కడ కొనసాగుతున్న ఆదివాసీ ఆచార సంప్రదాయాల గురించి వారికి వివరించారు.

మేడారం విశిష్టత.. జాతర అభివృద్ధిపై వివరణ...

మేడారం సమ్మక్క-సారలమ్మల మహాజాతర ప్రత్యేకతతో పాటు జాతర అభివృద్ధి పనులు,గద్దెల నిర్మాణం,భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను దేవాదాయ శాఖ అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. మహాజాతర సమయంలో మేడారం కోట్లాది మంది భక్తులతో కిక్కిరిసిపోతుందని,ఆ సమయంలో భారీ జనసందోహం కారణంగా ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలించడం కష్టమవుతుందని అధికారులు తెలిపారు.సాధారణ రోజుల్లో మేడారాన్ని సందర్శించి ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ,జాతర నిర్వహణ విధానాన్ని తెలుసుకోవాలనే ఉద్దేశంతో తాము వచ్చినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.సమ్మక్కను చిలకలగుట్ట నుంచి గద్దెలకు తీసుకురావడం, సారలమ్మను కన్నెపల్లి నుంచి కాక వంశస్థులు తీసుకురావడం, గోవిందరాజును కొండాయి నుంచి తీసుకురావడం,పగిడిద్దరాజును పూనుగొండ్ల నుంచి తీసుకువచ్చే సంప్రదాయాలను వారికి వివరించారు.జాతర సందర్భంగా చేపట్టే వివిధ ఆచారాలు,పూజా కార్యక్రమాల గురించి పూజారులు వివరించారు.

కోట్లాది భక్తుల రాకే మేడారం ప్రత్యేకత..!

మేడారం జాతర కోసం ఈసారి భారీగా నిధులు వెచ్చించి గద్దెల అభివృద్ధి, ఇతర సౌకర్యాల కల్పనకు పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గద్దెల నిర్మాణం, పరిసర ప్రాంతాల అభివృద్ధిని చూసిన ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు.

మంత్రముగ్ధులైన ప్రపంచ బ్యాంకు బృందం..!

మేడారం విశిష్టత,ఆదివాసీ సంప్రదాయాలు, పూజా విధానాలు,మహాజాతరకు తరలివచ్చే భక్తుల సంఖ్య గురించి తెలుసుకున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం మంత్రముగ్ధులైనట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి ఎన్నో దేవాలయాలు,జాతరలను సందర్శించినప్పటికీ మేడారం సమ్మక్క- సారలమ్మల జాతర ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని ప్రతినిధులు పేర్కొన్నారు. కోట్లాది మంది భక్తులు ఒకే చోటకు తరలివచ్చి తమ ఆరాధ్య దేవతలను దర్శించుకోవడం మేడారం మహాజాతర గొప్పతనానికి నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. మేడారం కేవలం ఒక జాతర మాత్రమే కాదని ఆదివాసీ సంస్కృతి,సంప్రదాయం,విశ్వాసం, అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప వేదిక అని ప్రతినిధులు కొనియాడారు. మేడారం విశిష్టతను,ఇక్కడి సంప్రదాయాలను తెలుసుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, పూజారులు,సిబ్బంది పాల్గొన్నారు.







నారాయణపురం కాలనీలో బీఆర్ఎస్ నేతల గణపతి నవరాత్రుల ఉత్సవాలలో భాగస్వామ్యం...

- శ్రీ వరసిద్ధి వినాయక మహాఅన్నదానంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు...
- అనారోగ్య బాధితులను పరామర్శించి భరోసా కల్పించిన నేతలు...

అశ్వారావుపేట:సెప్టెంబర్ 16(డిడి 9 వార్త)

అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. బీఆర్ఎస్ మండల నాయకులు కాసాని నాగశేషా పద్మచంద్రమోహన్, కౌన్సిలర్ డా. ఉదయ జ్యోతిడా. ప్రసాద్, గుడవర్తి వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ తదితరులు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నారాయణపురం కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరైన నాయకులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు.
తదనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మిండా పెద్ద దుర్గారావు అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కాటూరి రజనిని పరామర్శించి ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మోటూరి మోహన్, ఆరెపల్లి గోవిందం, పాలవలస జీవన్, కౌలూరి నరేష్, కాటూరి నాగు, జక్కుల సందీప్, గుర్రాల భరత్, చందా సురేష్, మంగరాజు, శ్రీనివాస్, నారాయణపురం సొసైటీ అధ్యక్షులు నిర్మల పుల్లారావు, జక్కుల రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు గేనాల శివ, దేవరశెట్టి కిషోర్, బాలిన భాస్కరరావు, బండి రాము, లక్ష్మణ్, చితిని పణిబాబు, కాసినశెట్టి సత్తిబాబు, పల్లెల వెంకన్న బాబు, రాయగిరి ప్రసాద్‌తో పాటు గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





జనగామబొట్ల చిలకమ్మా మృతదేహాన్ని కి అర్పిస్తున్న జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజు

- జనగామ జిల్లా కాంగ్రెస్ నేతలు

జనగామ సెప్టెంబర్16(డిడి9) వార్త

ఈరోజు జనగామ పట్టణం లో రాష్ట్ర SC సెల్ వైస్ చైర్మన్ *బోట్ల శ్రీనివాస్ తల్లి క్రి.శే బోట్ల చిలకమ్మ(80) పరమపదించిన విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ....ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ *బనుక శివరాజ్ యాదవ్ జిల్లా కాంగ్రెస్ నేతలు చెంచారపు బుచ్చి రెడ్డి, వంగాల మల్లారెడ్డి, AMC డైరెక్టర్ బోట్ల నర్సింగరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి md ఖాదర్ షరీఫ్,NSUI నాయకులు md తారీక్ ఇల్లయ,16వ మాజీ అధ్యక్షులు గాదేపాక ప్రసాద్,వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు నల్ల సుధాకర్ మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ నుంచి బీసీల సింహగర్జన

జనగామ,సెప్టెంబర్16(డిడి 9 వార్త) బ్యూరో

గోల్కొండ కోట నుంచి గురువారం ప్రారంభమయ్యే బీసీ రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని టీఆర్పీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం జనగామలో జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బీసీల హక్కులు, ఆత్మ గౌరవం, రాజ్యాధికారంలో తగిన వాటా కోసం తీన్మార్ మల్లన్న చేస్తున్న పోరాటానికి మద్దతుగా పెద్దఎత్తున తరలిరావాలని నాయకులు కోరారు. సమావేశంలో డాక్టర్ మాచర్ల భిక్షపతి, గడ్డం కృష్ణ, పిట్టల సురేష్, వెంబటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లా నరసింహులు శతజయంతి ఉత్సవాలకు సన్నాహాలు

జనగామ సెప్టెంబర్ 16(డిడి 9వార్త) బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు నల్లా నరసింహులు 100వ జయంతి ఉత్సవాలను అక్టోబర్ 2న ఘనంగా నిర్వహించేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. కటకం నర్సింగ్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. నల్లా నరసింహులు ప్రజల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కటకం నర్సింగ్‌రావు కోరారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ కి 22A సమస్య ల నుండి పేద ప్రజల భూములను కాపాడండి

తాడ్వాయి డిడి9 వార్త

ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ని తెలుగు దేశం పార్టీ నాయకులు కలిసి పేద సామాన్య కుటుంబాలకు భూములు రక్షణగా ఉంటున్నాయి వాటి ఆధారంగా పేదప్రజలు తమ పొట్టపోసుకొని తమ పిల్లలను చదివిస్తూ కొన్ని సందర్భాలలో వాటిని తనఖా పెట్టో లేదా అమ్ముకొని తమ బిడ్డలకు పెళ్ళిళ్ళు చేయడం కాని ఉన్నత చదువులకు అనారోగ్యంగా వున్నపుడు అవి ఉపయోగపడుతున్నాయి ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో చేర్చి వాటికి పట్టాలు రాకుండా రిజిస్ట్రేషన్ కాకుండా చేయడం సరియైన విధానం కాదని ప్రభుత్వ అనాలోచిత లేదా తప్పుడు నిర్ణయాలు ప్రజలకు శాపంగా మారకుండా చూడాలని పేద సామాన్య ప్రజలు ఇప్పటికే భూభారతి చట్టం అమలుతో తమ భూములకు పట్టాలు ఇవ్వాలి రిజిస్ట్రేషన్ల చేయాలని ఆఫిసుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగి నాభూములకు మోక్షం లభించడం లేదు అటువంటి పొడు భూములకు పట్టాలు ఇచ్చి పేద సామాన్య రైతులను ఆదుకోవాలని తెలుగు దేశం పార్టీ నాయకులు దరపత్ దేవా నాయక్ ములుగు మండలఅధ్యక్షులు MA సలీం శ్రీనివాసరావు బళ్ళారి మాజీ సర్పంచ్ లాలయ్య సత్యనారాయణ రఘుబాబు శివాజీ ఏటూరు నాగారం రమణ రవీంద్రాచారి సత్యం తదితర 100మంది నాయకులు పాల్గొన్నారు

రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క ఆదేశాల మేరకు , జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ , జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సా ర్ఖాన్ మండల అధ్యక్షులు కోడి సతీష్ కుమార్ సూచనల తో

- **ఊరట్టం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా గొంది మనోజ్**

తాడ్వాయి డిడి9 వార్త

ఊరట్టం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గా గొంది మనోజ్ కి నియామక పత్రం అంద జేసిన తాడ్వాయి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దుబాసి సుధాకర్ ములుగు నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జీ జాలిగపు జంపన్న తాడ్వాయి మండలం , ఊరట్టం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా గొంది మనోజ్ కీ ఊరట్టం గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చర్ప అఖిల్ ఉపసర్పంచ్ కాక రంజిత్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేసిన తాడ్వాయి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దుబాసి సుధాకర్ ఉపాధ్యక్షులుగా గజ్జల సంపత్ నియామకం చేయడం జరిగింది ఈకార్యక్రమంలో మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంబటి రవి , ప్రధాన కార్యదర్శి చర్ప వీరమోహన్ రావు , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ , ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పురుషోత్తం నారాయణ , మండల నాయకులు కడారి శేఖర్ , గొంది సాంబశివరావు , గజ్జెల రాజేందర్ , గజ్జెల సందీప్ , చర్ప చంద్ర శేఖర్ , పాయం సంపత్ , సంతోష్ , పాయం కార్తిక్ , సాయి , కాక ప్రశాంత్ , గజ్జెల పవన్ , సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు



ప్రీ ప్రైమరీ నియామకాలపై అధికారుల మౌనం!

- **నియామకాల వెనుక ఎవరెవరి పాత్ర?**
- **నిబంధనలు పాటించారా.. ఉల్లంఘించారా?**
- **ఒకరికి ఆర్డర్.. 40 రోజులకే రద్దు?**
- **ఒక చోట అర్హత లేని వారికి పోస్టింగ్**
- **అసలు తెరవెనుక ఏం జరిగింది?**

బోనకల్,సెప్టెంబర్ 16,(డీడీ9 వార్త):


ప్రీ ప్రైమరీ బోధకుల నియామకాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నా సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నియామకాల ప్రక్రియ నిబంధనల ప్రకారమే జరిగాయా లేక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారా అన్న ప్రశ్నలు ఆశావహుల్లో వ్యక్తమవుతున్నాయి.నియామకాల ప్రక్రియలో తహసీల్దార్, ఎంపీడీఓల భాగస్వామ్యం ఎంత మేరకు ఉంది, వారి పాత్ర ఏదైనా ఉంటే దాని పరిధి ఏమిటని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు,అలాగే విద్యాశాఖ అధికారి పాత్ర కూడా ఎంత వరకు ఉంది? నియామక ప్రక్రియలో ఎవరు ఏ బాధ్యత నిర్వహించారు,అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగి ఉంటే బాధ్యులుగా ఎవర్ని చూడాలి,నిర్ణయం ఎవరి ఆధారంగా తీసుకున్నారు,అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన రికార్డులు, అర్హతలు, నియామక ఉత్తర్వులు, తదుపరి జరిగిన మార్పులపై సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ వినిపిస్తోంది.ఇప్పటికే ఈ వ్యవహారం మండల కేంద్రం చుట్టూనే తిరుగుతున్నా.. విచారణ ఎక్కడ? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నియామకాలపై వచ్చిన ఆరోపణలను పక్కన పెట్టకుండా జిల్లా స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మండల కేంద్రం చుట్టే తిరుగుతున్న వ్యవహారం!:

ప్రీ ప్రైమరీ నియామకాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడం మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది.నియామకాలపై సమగ్ర విచారణ జరిపి,అర్హతలు,మెరిట్,ఎంపిక ప్రక్రియ, ఉత్తర్వుల జారీ-రద్దుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని ఆశావహులు డిమాండ్ చేస్తున్నారు.నియామక ప్రక్రియ పారదర్శకంగా జరిగిందా?ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించారా?

ఉల్లంఘన జరిగితే బాధ్యులు ఎవరు? జిల్లా కలెక్టర్,జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందిస్తారా!లేక అధికారుల మౌనం కొనసాగుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.





ప్రీ ప్రైమరీ అంతా గోల్ మాల్.....

- ప్రీ ప్రైమరీ బోధకుల నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయా?
- లేక అధికారుల నిర్లక్ష్యంతో లోపాలున్నాయా?
- త్రిసభ్య కమిటీతో ముగురు ముఖ్య మంత్రిత్వశాఖ అధికారులు
- మొదట్ మ్యక్రీ అర్హతలో లోపం ఉంటే నియామకానికి ముందే ఎందుకు గుర్తించలేకపోయారు?
- అసలు మొదటిదాని ధ్రువ పత్రాలు పరిశీలన సరిగా జరిగిందా?
- అదే జరిగితే 40 రోజుల తర్వాత మరొకరికి అవకాశం ఎలా?
- నియామకాలు పారదర్శకంగా జరిగాయా? ఏదైనా మతలబు జరిగే ఉంటుందా?
- ఒకే పోస్టుకు రెండు నిర్ణయాలా? త్రిసభ్య కమిటీ పూర్తిగా లోపాలున్నాయా? లేక ఏమీ తీర్పు ఇవ్వలేదా?

సమగ్రమైన కోళ్ళు అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయలేకపోయారా? అంటే ఆ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందా? అయితే లోపాలు ఎందుకు గుర్తించలేకపోయారు? మాత్రం ఒకే పోస్టుకు సంబంధించి మరుగా రెండు నర్సరీలు వెలువడటం తీవ్ర చర్చకు దారితీస్తుంది.

మొదట బోనకల్ గ్రామానికి చెందిన ఓ అర్హత కలిగిన మహిళా ప్రీ ప్రైమరీ టీచర్‌ను త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ మహిళ 40 రోజుల పాటు నిర్విరామంగా విధులు నిర్వహించారు.అయితే ఆ తర్వాత అదే పోస్టుకు మరో మహిళను నియమించినట్లు విద్యాశాఖ అధికారి తెలిపినట్లు ఇతర అభ్యర్థులు పేర్కొంటున్నారు. దీంతో అసలు మొదట్ నియామకం ఎందుకు జరిగింది? 40 రోజుల తాత్కాలిక మర్యాదకు మర్యాదలు వచ్చింది? అనే ప్రశ్నలు ప్రస్తుతం తెలెత్తుతున్నాయి.

తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిపోయిన సాంకేతిక సేవలు

- **ఇబ్బందుల్లో ప్రజలు**
- **తహసీల్దార్కార్యాలయంలో సాంకేతిక సమస్యలు కరెంట్ కష్టాలు**

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్)

బజార్హత్నూర్ మండలం లో రెవెన్యూ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సర్వర్ నిలిచిపోవడం, ఇంటర్నెట్ కనెక్షన్ సమస్యల వల్ల ధరణి మీసేవ సంబంధిత పోర్టల్‌లు పనిచేయకపోవడంతో పలు రకాల సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన సమస్యల రైతులకు ఇబ్బందులు పట్టాదారు పాస్ పుస్తకాలు, భూమి రిజిస్ట్రేషన్లు, స్లాట్ బుకింగ్ పనులు నిలిచిపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. విద్యార్థులకు ఆలస్యం: కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల (సర్టిఫికెట్లు) జారీ నిలిచిపోవడంతో స్కాలర్‌షిప్‌లు, ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ సేవలు ఆధార్ అనుసంధానం, మ్యూటేషన్ (అడంగల్/పహణీ) మార్పులు కాకపోవడంతో ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతిక లోపాన్ని త్వరగా సరిచేసి, సేవలను పునరుద్ధరించాలని ఉన్నతాధికారులను బాధితులు కోరుతున్నారు. సమస్యను ఐటీ టీమ్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.





నిధులు ఇవ్వకుంటే ఆర్మూర్ కోసం రాజీనామాకైనా సిద్ధం!

- **ఆర్మూర్ నియోజకవర్గ నిధులపై అసెంబ్లీలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**
- **రూ.27 కోట్లతో రెవెన్యూ భవనాలు నిర్మించాలని డిమాండ్**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

"మా నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టవా? ఆర్మూర్‌కు రావాల్సిన నిధులు ఇవ్వకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికైనా వెనుకాడను" అని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం శాసనసభ సమావేశాల్లో ఆయన ఆర్మూర్ ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన మౌలిక వసతుల కొరతపై ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఏళ్లుగా శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్న రెవెన్యూ కార్యాలయాల వల్ల ప్రజలు పడుతున్న అవస్థలను సభలో ఎలుగెత్తి చాటారు. "సమస్యను ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ఒకవైపు ముఖ్యమంత్రి, మంత్రుల నియోజకవర్గాలకు నిధుల వరద పారుతోంది.. దానికి సంబంధించిన అన్ని ఆధారాలూ నా వద్ద ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. ఆర్మూర్ అభివృద్ధిని విస్మరించడం సరికాదని, వెంటనే రూ.27 కోట్లు కేటాయించి కొత్త రెవెన్యూ భవనాలను నిర్మించాలని కోరారు. ప్రజా ప్రయోజనాల కోసం ఏ త్యాగానికైనా సిద్ధమని, నిధుల విడుదలపై ప్రభుత్వం స్పందించకుంటే రాజీనామా బాటపడతానని తేల్చిచెప్పారు.



ప్లాస్టిక్ రహిత గ్రామానికి ఎన్ఆర్ఐ తోడ్పాటు

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో భాగంగా కమ్మరపల్లి మ్యందళం బషీరాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ పెంట సంతోష్ ఉదారత చాటుకున్నారు. గ్రామంలో ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు ఆయన 200 ఉక్కు గ్లాసులు, 200 ప్లేట్లను గ్రామ పంచాయతీకి ఉచితంగా అందజేశారు. బుధవారం సర్పంచ్ జమున మహేష్ చేతుల మీదుగా ఈ సామగ్రిని పంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించే వివిధ శుభకార్యాలు, శుభకార్యక్రమాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లకు బదులుగా గ్రామ పంచాయతీలోని ఈ ఉక్కు సామగ్రిని గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు. ప్లాస్టిక్ రహిత బషీరాబాద్ లక్ష్యంగా ఎన్ఆర్ఐ సంతోష్ అందించిన సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విద్యాసంద్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, ఉపసర్పంచ్ భూమేశ్వర్, వార్డు సభ్యులు రమేష్, శేఖర్, లావణ్య, రాకేష్ గౌడ్, గ్రామ నాయకులు రవి, విశాల్, యమన్నలతో పాటు సంతోష్‌కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





నెలాఖరులోగా భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి

- **-తహసీల్దార్లతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**
- **-జూలై 31 నాటి అర్జీలు పెండింగ్‌లో ఉండొద్దు**
- **-ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరాపై నిఘా**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన తహసీల్దార్లతో భూభారతి అర్జీలు, ప్రజావాణి ఫిర్యాదులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూలై 31వ తేదీ లోపు అందిన దరఖాస్తుల్లో ఏ ఒక్కటీ పెండింగ్‌లో ఉండడానికి వీల్లేదన్నారు. దరఖాస్తుల పరిశీలన, ఆమోదం లేదా తిరస్కరణ ప్రక్రియల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తూ.. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్ణీత ధరకే ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దళారుల ప్రమేయం ఉన్నా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులను కూడా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, డీఆర్ఓ గీత, ఆర్డీఓలు పాల్గొన్నారు.

బోథ్‌లో ఘనంగా 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవం

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 16: (డి డి 9 వార్త న్యూస్):

బోథ్: 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవం సందర్భంగా బోథ్ బస్టాండ్ అదిలాబాద్ జిల్లా కన్వీనర్ బరతాల గోవర్ధన్ జెండా ఆవిష్కరించి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా నినాదాలు చేస్తూ వెళ్లి అమరుల స్థూపం వద్ద అమరులను స్మరించుకుంటూ పూలు సమర్పించడం అనంతరం బస్టాండ్ నుంచి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. అమర వీరుల స్తూపం వద్ద అమరులకు పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, సిపిఐ అదిలాబాద్ జిల్లా. కన్వీన. భర్తల గోవర్ధన్. మండల అధ్యక్షుడు. ఎల్ నరేష్, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మున్నిప్. రైతు సంఘ అధ్యక్షుడు. భోజన్న గౌరమ్మ భాగిర్త పోసాని అమాలి అధ్యక్షుడు.బాబు ఆశన్న రవి పాల్గొన్నారు.



కళాభారతి పనులు వేగవంతం చేయాలి


- **-నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి**
- **-రెసిడెన్షియల్ స్కూల్ స్థలాల పరిశీలన**
- **-జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశం**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ ఆవరణలో నిర్మిస్తున్న కళాభారతి ఆడిటోరియం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆడిటోరియం నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి సుదీర్ఘంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు, విభిన్న వేదికల నిర్వహణకు అనువైన వేదికలు లేకపోవడంతో కళాభారతి నిర్మాణం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొత్తం ఐదు అంతస్తుల్లో అధునాతన సదుపాయాలతో దీనిని రూపుదిద్దుతున్నామని తెలిపారు. ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి భవన నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే భవనానికి సంబంధించి వేదిక, రెండు భారీ బ్యాంకెట్ హాళ్లు, 1400 మంది ప్రేక్షకులు ఆసీనులు కాగల ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీతో పాటు ప్రధాన ఫ్రేమ్ వర్క్ పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన ఫినిషింగ్ పనులను సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల ప్రగతిని క్రమం తప్పకుండా తన నివేదించాలని స్పష్టం చేశారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్', వసతి గృహ సముదాయాల నిర్మాణానికి సేకరిస్తున్న స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. మండల పరిధిలోని గుండారంతో పాటు, నాగారం నందిగుట్ట ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను అధికారులతో కలసి పరిశీలించి, పాఠశాలల నిర్మాణానికి అవసరమైన సమగ్ర నివేదికలు, ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆర్ అండ్ బీ ఈఈ ప్రవీణ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అక్టోబరు మొదటి వారం నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- **ఖరీఫ్ ధాన్యం సేకరణపై సమీక్షించిన కలెక్టర్ భవేష్ మిశ్రా**
- **జిల్లాలో 736 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం**
- **ఈసారి రైస్‌మిల్లులకు పంపకుండా గోడౌన్లలోనే నిల్వ**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

జిల్లాలో రాబోయే ఖరీఫ్ ధాన్యం సేకరణను పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని, అక్టోబరు మొదటి వారం నుంచే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లతో ఆయన ధాన్యం కొనుగోళ్లు, నిల్వ ఏర్పాట్లపై విస్తృత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ సీజన్‌లో 4.35 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని, సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అందుకోసం గతేడాది కంటే అదనంగా 76 కలిపి మొత్తం 736 కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా తూకం యంత్రాలు, తేమ కొలిచే సాధనాలు, టార్పాలిన్లు, గన్నీ సంచులను తగినంత సంఖ్యలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈసారి సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపే అవకాశం లేకపోవడంతో, ప్రభుత్వ, ప్రైవేటు గిడ్డంగులతో పాటు మార్కెట్ కమిటీ గోడౌన్లను ముందుగానే తనిఖీ చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైతే మూతపడిన మిల్లులు, ఫంక్షన్ హాళ్లను కూడా పరిశీలించాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, డీఆర్ఓ గీత, ఆర్డీఓలు, సివిల్ సప్లైస్ అధికారులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర అనన్యసామాన్యం

- -బోధన్‌లో వైభవంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు
- చేతివృత్తుల నైపుణ్యమే సమాజానికి మూలాధారం: ఉదయ్ మహారాజ్





బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

సంప్రదాయ చేతివృత్తులు, నిర్మాణ కళలతో సమాజ పురోగతికి బాటలు వేసిన విశ్వబ్రాహ్మణుల సేవలు ప్రశంసనీయమని యోగా ధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉదయ్ మహారాజ్ పేర్కొన్నారు. బోధన్ పట్టణం సరస్వతీనగర్‌లోని విశ్వకర్మ భవనంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మహారాజ్ మాట్లాడుతూ.. సమస్త ప్రాచీన, ఆధునిక నిర్మాణాలకు మార్గదర్శి విశ్వకర్మ భగవానుడేనని చెప్పారు. పంచకుల వృత్తులైన స్వర్ణకార, వడ్రంగి, కమ్మరి, కాంచరి, శిల్పకళా రంగాలు ఆధునిక కాలంలోనూ సాంకేతికతను జోడించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.విశ్వకర్మజయంతి సందర్భంగా సంఘ నాయకులను, సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కే. ప్రభాకర్ చారి, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు హనుమాన్లు చారితో పాటు హరికాంత్, బాలాజీ చారి, అశోక్ చారి, సుధాకర్ చారి, రమణాచారి, రాందాస్ చారి, కిషోర్ చారి తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

అదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 16: (డి 9 వార్త న్యూస్):

ఈరోజు బోథ్ మండల పంచాయతీ కార్యదర్శులు సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

సంఘ అధ్యక్షుడిగా జాదవ్ అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు గంగయ్య , మరియు నాజ్మి , ట్రెజరర్ గా పవర్ బాపూరావు, జనరల్ సెక్రటరీగా ఎండి షకిల్, గౌరవాధ్యక్షులుగా పి అంజయ్య , ఎన్నిక కావటం జరిగింది .

సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలి

- అదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 16: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు బోథ్ మండల కేంద్రంలో రేపు అనగా గురువారం రోజు భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు ప్రతి మండలాలలో సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ వియోచన దినోత్సవంగా నిర్వహించలని మరియు తెలంగాణ వియోచన చరిత్ర ను శాశ్వతంగ పరిరక్షించేందుకు తెలంగాణ సప్త సంకల్పాలు అమలు చేయాలని. ఈరోజు బోథ్ మండల తహసీల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమనికి మండల అధ్యక్షులు బోరే రవీందర్ జిల్లా అధికార ప్రతినిధి జి వి. రమణ,బిజెపి మాజీ జాతీయ కార్యవర్గ నాయకులు అమర్సింగ్ తిలావత్ ,నాయకులు పిఎసిఎస్ కదం ప్రశాంత్,పిడుగు అశోక్ రెడ్డి,జక్కుల వెంకటేష్,శేఖన్న,విజయ్,నారాయణ , పాల్గొన్నారు. అదేవిధంగా మన దేశ ప్రధానీ నరేంద్ర మోడీ గారు 25ఇయర్స్ పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి బోథ్ మండలంలోని బీజేపీ నాయకులు కార్యకర్తలు ఆశ వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు ,అదేవిధంగా గ్రామ పంచాయతీ పరిశుద్ధ కార్మికులు, ఉపాధ్యాయులు,మేధావులు ,అందరూ సాయంత్రం 7గంటలకు ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించి వారికి ఆశీర్వాదం ఇవ్వాలని కోరడం జరిగింది.



పేదల పెన్నిధి సీఎంఆర్ఎఫ్ : కౌన్సిలర్ రాంమూర్తి

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

పేదల సంక్షేమానికి, ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని 1వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి రాంమూర్తి కొనియాడారు. బోధన్ పట్టణ పరిధిలోని ఆచన్ పల్లి నివాసి భూమయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం నాయకులతో కలిసి అందజేశారు. ఆపద సమయాల్లో సీఎంఆర్ఎఫ్ పేదలకు కొండంత అండగా నిలుస్తోందని, ప్రభుత్వం పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సాయిలు, సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఓజోన్ క్షీణతకు కారణమయ్యే పదార్థాల వాడకాన్ని తగ్గించాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ పర్యావరణ ఇంజనీర్ రవిదాస్ కోరారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా బుధవారం నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ భవన్‌లో పీసీబీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ డాక్టర్ తిరుపతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ మాట్లాడుతూ.. ఓజోన్ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరిశ్రమలు, ఆసుపత్రుల ప్రతినిధులు, పీసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద కేసు నమోదు

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

అనుమతి లేకుండా చెట్లను నరికివేసే వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ హెచ్చరించారు. సాంపల్లి గ్రామానికి చెందిన మసూరి ప్రశాంత్ అనే వ్యక్తి తన పట్టా భూమిలో 12 చెట్లను నరికివేసిన దృష్ట్యా అతనిపై వాల్టా చట్టం 2002 కింద కేసు నమోదు చేసినట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు యానంపల్లి ఎఫ్ఎస్ఓ సురేందర్, సుద్దపల్లి ఎఫ్‌బీఓ సతీష్‌లు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి ఈ అక్రమాన్ని నిర్ధారించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలందరూ చెట్లను, వన్యప్రాణులను కాపాడుకోవాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఎఫ్ఆర్ఓ స్పష్టం చేశారు.

అటవీ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవు

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

అక్రమంగా చెట్లను నరికివేసి అటవీ సంపదకు నష్టం కలిగిస్తే సహించేది లేదని ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ స్పష్టం చేశారు. గౌరారం (ఉత్తరం) బీట్ పరిధిలోని జి కే తండాలో 8 చెట్లను అనధికారికంగా నరికిన రమావత్ రామచందర్ అనే వ్యక్తికి రూ.9,990 జరిమానా విధించినట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి. మానస, బీట్ ఆఫీసర్ సిహెచ్. నవీన్ రాజ్ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ఈ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అటవీ భూములు, చెట్లు, వన్యప్రాణుల రక్షణకు మండల ప్రజలు సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తెలంగాణ అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ హెచ్చరించారు.

చేయూత పెన్షన్ సర్వే చేసిన ఎంపీడీవో రత్నాకర్ రావు

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 16: (డిడి 9 వార్త న్యూస్):


ఈరోజు సోనాల మండలంలోని జి పి వజ్జర్ ,కేశవగూడ,చింతల్ బోరి ప్రాంతాల్లో చేయూత పింఛన్ సర్వే చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఒంటరి మహిళా,వితంతువు,వికలాంగులు,సంబంధించిన సదరం సర్టిఫికెట్,నివాస పత్రం , అప్లికేషన్ చేసుకున్న వారు పట్టా పాస్ బుక్ ,బ్యాంకు అకౌంట్ , రేషన్ కార్డ్,ఆధార్ కార్డు,లబ్ది దారులు అందరూ మీ దగ్గర ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఉంచుకోవాలి అని గ్రామ సర్పంచు కానీ పెన్షన్ ఆఫీసర్స్ కి కానీ పంచాయతీ కార్యదర్శికి చూయించాలి ఎవరైనా గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వే కి వస్తె చూయించాలి అని సూచించారు ఈ కార్యక్రమంలో సోనాల ఎంపీడీవో రత్నాకర్ రావ్ పాల్గొన్నారు



రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 16: (డిడి 9 వార్త న్యూస్):

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి జీవనోపాధి కోసం కుటుంబానికి మేకలు పంపిణి ద్వారా ఉపాధి పొందుతున్న కుటుంబం.
నేడు బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన ఇదాపు చిన్నయ్య అనే రైతు గత ఆరు, ఏడు సంవత్సరం క్రితం ఆశించినంత పంట దిగుబడి రాలేదని మనోవేదనకు గురై తాను నమ్ముకున్న పంట పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు బాధిత కుటుంబానికి రూరల్ డెవలప్ మెంట్ సర్వీస్ సొసైటీ (ఆర్ డి ఎస్ ఎస్) వారి ఆర్థిక సహాకారంతో రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఫీల్డ్ విజిటర్ విలాస్ ఆధ్వర్యంలో,50 వేల రూపాయల విలువ గల మేకలను పంపిణి ద్వారా అధిక ఆదాయాన్ని పొందుతున్న రైతు కుటుంబానికి జీవనోపాధి అవకాశాలు పొందడానికి మేకల పెంపకం ద్వారా పునర్భుత్తి చెందుతు వీటి ద్వారా వచ్చే ఆదాయంతో వీరి పిల్లలకు ఉన్నతమైన విద్య మరియు వైద్యాపరంగానే కాకుండా కొంత కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని మరియు
ఈ కుటుంబానికి మేకలను పంపిణి చేసిన తరువాత వీటి ద్వారా వచ్చే మేకల పునరుత్పత్తి ద్వారా వచ్చేఆదాయంతో ఈ యొక్క కుటుంబం ప్రస్తుతం చాలా సంతోషంగా ఉన్నామని వారన్నారు. రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో రైతు ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాలకు పలు విధాలుగా , మేకలు,ఆవులు,గేదెలు, గొర్రెలు, పిండిగిర్నీ, కుట్టుమిషిన్స్, కిరాణా షాప్, వీటి ద్వారా ఈ కుటుంబాలకు ఎన్నో విధాలుగా ఆర్థికంగా ఎదగడానికి వీరి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎన్నో విధాలుగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూనే ఉందని ఆయన అన్నారు. ఇందులో పాల్గొన్నవారు విలాస్,నడిపెన్న, నరేష్ , రవి కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్ షారుక్ తో పాటు గంగామణి తదితరులు పాల్గొన్నారు.
సంగెపు బొర్రన్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు ఆదిలాబాద్.



సైలెన్సర్ మార్చి రచ్చ చేస్తే ఊరుకోం : సీపీ సాయి చైతన్య

- శబ్ద కాలుష్యానికి కారణమైన బుల్లెట్ బైక్ సీజ్
- బాల్కొండలో ఆకతాయిపై కేసు నమోదు

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):



ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్లు అమర్చుకుని పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య హెచ్చరించారు. బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వేళ బుల్లెట్ బైక్‌కు మార్చబడిన సైలెన్సర్‌ను అమర్చి, అధిక శబ్దంతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఒక వ్యక్తిపై బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసి సదరు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వాహనాలకు మోతాదుకు మించిన శబ్దాన్ని ఉత్పత్తి చేసే సైలెన్సర్లను అమర్చుకోవడానికి చట్టరీత్యా ఎలాంటి అనుమతి లేదన్నారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యానికి కారణమవుతూ ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కంపెనీ మోడల్‌ను మార్చి సైలెన్సర్లు బిగించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక నిబంధనలు : సీపీ పి.సాయి చైతన్య

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):



నిజామాvw బాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, పబ్లిక్ ఆర్డర్ నిర్వహణలో భాగంగా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు. కలెక్టర్ నేతృత్వం లోని కమిటీ అనుమతి లేనిదే విగ్రహాల ప్రతిష్టాపన చేపట్టవద్దని ఆదేశించారు. రాత్రి పూట 55 డెసిబెల్స్ మించి శబ్దం చేయరాదని, రాత్రి 10 గంటల తర్వాత డీజేలు వాడటం నిషేధమని తెలిపారు. 500 మంది కంటే ఎక్కువ జనం పాల్గొనే సభలకు 72 గంటల ముందే సీపీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. డ్రోన్ల వినియోగానికి ఏవియేషన్, పోలీస్ అనుమతులు తప్పనిసరని పేర్కొన్నారు. బహిరంగ మద్యపానాన్ని అరికట్టేందుకు ఎస్సైవోలకు స్పష్టమైన అధికారాలు ఇచ్చామన్నారు. జిల్లాలో అనధికారికంగా వ్యాపారాలు చేసే నకిలీ గల్ఫ్ ఏజెంట్ల వివరాలను పోలీసులకు అందించాలని సీపీ కోరారు.



పోషణ్ మాసంతో తల్లి, పిల్లల ఆరోగ్యం సురక్షితం : సీడీపీవో నందిని

- -సాలూరాలో వైభవంగా 9వ పోషణ్ మాసోత్సవం
- - తక్కువ ఖర్చుతో దొరికే పోషకాలపై అవగాహన
- -కంటికింపగా 'వెల్ బేబీ షో', శ్రీమంతాలు, అన్నప్రాసనలు

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):



సంఖ్యలోగర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లల్లో లోపపోషణను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా అంగన్‌వాడీ వ్యవస్థ పనిచేస్తోందని, ప్రతీ ఒక్కరూ పోషకాహారాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో నందిని పిలుపునిచ్చారు. బుధవారం సాలూర మండల స్థాయిలో 9వ 'పోషణ్ మాహోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో మాట్లాడుతూ...ఆహార అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.

సమాజంలో చాలామంది ఖరీదైన ఆహార పదార్థాల్లోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని భావిస్తారని, కానీ మనకు స్థానికంగా తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, కాయగూరలు, తృణధాన్యాలలో అధిక శాతంలో విటమిన్లు, ఖనిజలవణాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఏ వయస్సు పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలి? లోపపోషణ ఉన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'వెల్ బేబీ షో' సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆరోగ్యవంతమైన చిన్నారులకు ప్రశంసలు అందించారు. అనంతరం గర్భిణులకు సాంప్రదాయబద్ధంగా శ్రీమంతాలు జరిపించి, పసిపిల్లలకు పౌష్టికాహారంతో తొలి అన్నప్రాసనలు చేయించారు. అంగన్‌వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహార పదార్థాలతో వంటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో సాలూర ఎంపీడీవో నరసయ్య, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విద్యాసాగర్, సర్పంచ్ సుక్కం లావణ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ గంగావేణి, మండల అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

అటవీ భూమి ఆక్రమణకు యత్నం... వ్యక్తి పై కేసు నమోదు

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

ఆర్మూర్ డివిజన్, సిరికొండ రేంజ్ పరిధిలోని రావుట్ల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని ఆక్రమించేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.నరసింగరావు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రావుట్ల సెక్షన్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 395 అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత జరుగుతోందన్నసమాచారంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఈ.లచ్చయ్య, బీట్ ఆఫీసర్ ఎన్.పోషన్న తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మెట్టు తాండాకు చెందిన జర్పుల లింభ్య అనే వ్యక్తి అటవీ భూమిని ఆక్రమించే ఉద్దేశంతో అనధికారికంగా చెట్లను నరికివేసినట్లు గుర్తించారు. జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు, ఆర్మూర్ ఎఫ్‌డీఓ పర్యవేక్షణలో సదరు వ్యక్తిపై తెలంగాణ అటవీ చట్టాల ప్రకారం కోర్టు కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ పేర్కొన్నారు. కేసులు నమోదైతే అటవీ భూములపై హక్కులు వస్తాయనేది అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. అడవులను నరికినా, భూములను ఆక్రమించినా, వన్యప్రాణులకు హాని కలిగించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



విద్యా రంగాభివృద్ధికి కృషి చేయాలి

- **ఎంబెల్లి శంకర్‌కు ట్రస్మా ఘన సత్కారం**

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(డీడీ9 వార్త):

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్ని కైన బోధన్ పట్టణానికి చెందిన ఎంబెల్లి శంకర్‌కు బుధవారం ఆత్మీయ సత్కారం జరిగింది. ప్రైవేట్ స్కూల్స్ అండ్ కాలేజెస్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా అభినందించారు. ఉపాధ్యా యుల హక్కుల సాధనకు నిరంతరం శ్రమించాలని ఆకాంక్షించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యా రంగానికి బాసటగా ఉంటానని శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్, ప్రతినిధులు హరికృష్ణ, జయప్రకాశ్, సురేష్, చక్రవర్తి పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 16: (డిడి 9 వార్త న్యూస్):

సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా సోనాలా మండల బీజేపీ అధ్యక్షులు బోరె రవీందర్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో (తహసీల్దార్)కు మెమోరండం అందజేశారు.* 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం విముక్తి చెంది ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైన చారిత్రక ఘట్టాన్ని అధికారికంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవం గా అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విమోచన పోరాటంలో పాల్గొన్న వీరుల త్యాగాలను స్మరించుకుంటూ సెప్టెంబర్ 17న ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. చారిత్రక వాస్తవాలను భవిష్యత్ తరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జీవ రమణ ,సీనియర్ నాయకులు సుభాష్ సూర్య బీజేవైఎం జిల్లా నాయకులు మనలా శేఖర్ , రంజిత్ సింగ్,బీజేపీ యువ నాయకులు కచ్చకాయల హరీష్ మండల బీజేపీ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు గడ్కోల్‌లో సన్మానం

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల మనిషిగా పేరుపొందిన ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావులను సిరికొండ మండలం గడ్కోల్ గ్రామా వీడీసీ సభ్యులు ఘనంగా సన్మానించా రు. గ్రామంలో జరుగుతున్న సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులకు హాజరైన వారిని వీడీసీ బాధ్యులు ప్రత్యేకంగా గౌరవించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లా డుతూ.. ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో వ్యవసాయ రంగం దివాళా తీసిందని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. గడ్కోల్ రైతాంగం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కె. రమ, కే. రంగయ్య, వి. ప్రభాకర్, పాయం చిన్న చంద్రన్న, వి. కృష్ణ, పి. రామకృష్ణ, వీడీసీ చైర్మన్ కె. సంతోష్ రెడ్డి, కోశాధికారి ఎం. భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద బాధితులకు 'ఛాలెంజ్ యూత్' ఆసరా

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన దుమ్మాల లింబన్న కుటుంబానికి బడా భీమ్‌గల్ ఛాలెంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తమ సంఘం తరపున సమకూర్చిన రూ.25 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజే శారు. కుటుంబ పోషకుడిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి తమవంతు సాయం అందించామని యూత్ ప్రతినిధులు తెలిపారు. బాధితులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆపద సమయాల్లో ఆదుకోవడానికి యువత ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కవిత ను కలిసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జిల్లా అధ్యక్షుడు

- **బోథ్ ఇంచార్జ్ మాజీ ఏమ్మెల్యే రాథోడ్ బాపురావు**

ఆదిలాబాద్ జిల్లా (బ్యూరో): సెప్టెంబర్ 16: (డిడి 9 వార్త న్యూస్):

హైదరాబాద్: టీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాథోడ్ బాపురావు బుధవారం హైదరాబాద్‌లోని *తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించినందుకు కవిత కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా అధ్యక్ష పదవి తనకు అప్పగించడం పట్ల పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపిన రాథోడ్ బాపురావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాథోడ్ బాపురావు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పార్టీ వేదికల ద్వారా ప్రజల దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు చేపడతామని అన్నారు* పార్టీ కార్యకర్తలే సంస్థకు ప్రధాన బలమని పేర్కొంటూ.. గ్రామ, మండల స్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు కొత్తగా కార్యకర్తలను పార్టీలోకి తీసుకురావడం, యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజలతో పార్టీ నాయకులు నిరంతరం మమేకం కావాలని, స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిపారు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత వేదికలపై ప్రస్తావించడం ద్వారా పార్టీకి ప్రజల్లో మరింత చేరువయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీకి ఉన్న కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపడతామని రాథోడ్ బాపురావు తెలిపారు. జిల్లాలో పార్టీ నాయకత్వం సూచనలు, కార్యకర్తల సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు *ఈ సందర్భంగా కవిత తో జిల్లా రాజకీయ పరిస్థితులు పార్టీ సంస్థాగత వ్యవహారాలు భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాథోడ్ బాపురావు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.





భీంగల్ 'బీస్మా' నూతన కార్యవర్గం ఎన్నిక

- **నూతన సభ్యులను సన్మానించిన డాక్టర్ షఫీ**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ భీంగల్ మండల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా ఖదీమ్ ఇక్బాల్ సర్, కార్యదర్శిగా హరీష్ సర్, కోశాధికారిగా రిజ్వాన్ ఉద్దీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ డాక్టర్ షఫీ సర్ ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యులు మాట్లాడుతూ.. తెలంగాణలో నాణ్యమైన విద్యనందించడంలో బడ్జెట్ పాఠశాలల పాత్ర కీలకమని, యాజమాన్యాల సంక్షేమానికి ఐక్యంగా పనిచేస్తామని పిలుపునిచ్చారు. సన్మానించిన డాక్టర్ షఫీకి అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్లూర్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రారంభం

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

ఉప్లూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. లబ్ధిదారు షేక్ షహ్నాజ్ బేగం నిర్మాణ స్థలంలో సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ ముగ్గు పోసి బుధవారం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏలేటి మోహన్ రెడ్డి, సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రాధాన్యతగా అమలు చేస్తోందన్నారు. గ్రామానికి ఇళ్లు మంజూరు కావడానికి కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తక్కూరి ముత్యం, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, నాయకులు నరేందర్, డాక్టర్ నరేష్, సుంకరి విజయ్, కొమ్ముల రవీందర్, క్రాంతి రెడ్డి, సాధుల్లా, సల్మాన్, రాజేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బడా మిల్లర్ల ఉచ్చులో పడొద్దు

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

విజిలెన్స్ దాడుల పేరుతో రైస్ మిల్లులను బంద్ చేయడం సరికాదని, మిల్లులను ప్రారంభించాలని రెంజల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోబిన్ ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం సాటాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. కొందరు బడా మిల్లర్లు అక్రమ మార్గాల్లో ధాన్యాన్ని పక్కదారి మళ్లిస్తూ రైతులను, ప్రభుత్వాన్ని దగా చేస్తున్నారని ఆరోపించారు. బడా మిల్లర్లకు లాభం చేకూర్చేలా సాధారణ మిల్లర్లు ప్రవర్తించవద్దని పేర్కొన్నారు. రైస్ మిల్లులను వెంటనే ప్రారంభించకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో మిల్లుల ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కార్తీక్ యాదవ్, ధనుంజయ్, గాయజుద్దీన్, రవి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.





ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల్లో నాణ్యత పాటించాలి

- **-పోతంగల్, కొడిచెర్ల క్వారీలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీలు**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యనందించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల' నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. పోతంగల్‌లో నిర్మిస్తున్న మోడల్ స్కూల్ నిర్మాణ పనులను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. మైల్ స్టోన్ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయా లేదా అని ఆరా తీసిన కలెక్టర్.. నిర్దేశిత గడువులోగా పనులన్నీపూర్తయ్యేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం కొడిచెర్ల ఇసుక క్వారీని పరిశీలించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు నిబంధనల ప్రకారం ఇసుకను అందించాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.




పరిపాలనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- **- వైద్య, మినిస్టీరియల్ సిబ్బందికి శిక్షణ**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

వైద్యారోగ్య శాఖ సిబ్బంది తమ పరిపాలనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీ మినిస్టీరియల్, వైద్య సిబ్బందికి డ్రాఫ్టింగ్, ఆఫీస్ ప్రాసెస్ మొదలైన అంశాలపై శిక్షణ పూర్తి చేశారు. రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ యోహాన్ ఈ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి ప్రొసీడింగ్స్ తయారీ, లీవ్ రూల్స్, మెమోలు ఇవ్వడం, షోకాజ్ నోటీసులు రాయడం, ఆర్టీఐ, కోర్టు కేసుల డీలింగ్ అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీతో పాటు ఏవో సుమంత్ కుమార్, ఎస్వో రాజేశ్వర్, సూపరింటెండెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లయన్స్ బసవేశ్వరరావుకు అంతర్జాతీయ పురస్కారం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 16(డీడీ9 వార్త) :

లయన్స్ ఇంటర్నేషనల్ నిర్దేశించిన సభ్యత్వ విస్తరణ లక్ష్యంలో విశేష కృషి చేసినందుకు గాను, బోధన్‌కు చెందిన లయన్స్ మల్టీపుల్ కౌన్సిల్ జీఎంటీ, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ పోలవరపు బసవేశ్వరరావు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లయన్ మార్క్ ఎస్ చేతుల మీదుగా ఆయనకు 'మిషన్ 1.5 మిలియన్ మెంబర్‌షిప్ రాక్‌స్టార్' అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. గడిచిన మూడు దశాబ్దాలుగా సామాజిక సేవా రంగంలో విశేష సేవలందిస్తున్న బసవేశ్వరరావుకు ఈ అంతర్జాతీయ గౌరవం దక్కడం పట్ల పట్టణ ప్రముఖులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



హై-వోల్టేజ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'గూఢచారి 2' రిలీజ్ డేట్ లాక్డ్?

టాలెంటెడ్ హీరో అడివి శేష్, దర్శకుడు వినయ్ కుమార్ సిరిగినీడి కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'గూఢచారి 2' (G2). సంచలన విజయం సాధించిన 'గూఢచారి' సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుండటంతో ప్రేక్షకుల్లో మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో టాలెంటెడ్ నటి వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ హీరో ఇమ్రాన్ హష్మీ, మధు శాలిని, సుప్రియ యార్లగడ్డ, ప్రకాష్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తూ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా దాదాపు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే డిసెంబర్, జనవరి నెలల్లో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద పోటీ పడేందుకు పలు క్రేజీ సినిమాలు లైన్‌లో ఉండటంతో, రద్దీని దృష్టిలో ఉంచుకుని సరైన విడుదల తేదీ కోసం చిత్రబృందం మార్చుకుంది. ఈ నేపథ్యంలో అన్ని జోనర్ల ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా, ఈ సినిమాను ఫిబ్రవరి 5న విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

ఎం.ఎస్.సుబ్బులక్ష్మిగా రష్మిక ఖరారు



దిగ్గజ గాయని, భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథని తెరపైకి తీసుకురావడానికి చిత్రసీమలో ఎప్పట్నుంచో సన్నాహాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించింది చిత్రబృందం. కొన్ని రోజులుగా అనుకుంటున్న రష్మికనే చిత్ర బృందం ఎట్టకేలకు ఖరారు చేసింది. గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించనున్న ఈ చిత్రాన్ని అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేశ్, బన్నీవాస్ సంయుక్తంగా నిర్మించనున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. నేడు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి 110వ జయంతి సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ని అగ్రతార కమల్ హాసన్ చేతుల మీదుగా చెన్నైలో

కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు



కన్నడ నటుడు అనంత్ నాగ్ (Anant Nag)ను 2024కు గాను ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే (Dadasaheb Phalke Award) అవార్డు వరించింది. భారతీయ సినిమాకు అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డును ప్రకటించినట్లు కేంద్రం తెలిపింది. ఈనెల 22న గుజరాత్‌లోని కేవడియాలో 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

అనంత్‌నాగ్ కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠి, మలయాళ, ఇంగ్లిష్ భాషల్లో 300పైగా సినిమాల్లో నటించారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన.. 1973లో కన్నడ చిత్రం 'సంకల్ప' చిత్రసీమలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత శ్యామ్ బెనెగల్ రూపొందించిన 'మంథన్', 'కొండుర', 'కల్‌యుగ్' తదితర చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించారు. ఆర్‌కే నారాయణ్ కథల ఆధారంగా తెరకెక్కించిన ప్రసిద్ధ టెలీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో ఆయన మిఠాయివాలా పాత్రను పోషించారు.

బయలుదారి, కన్నేశ్వర రామ, గోది బన్న సాధారణ మైకట్టు, రాజకుమార, గాలిపట2, కేజీఎఫ్ వంటి చిత్రాలు ఆయనకు మంచి పేరు తీసుకొచ్చాయి. తెలుగులో ప్రేమలేఖలు, అనుగ్రహం, భీష్మ, బాలు, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. వెండితెర మీదే కాదు కర్ణాటక రాజకీయాల్లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. మల్లేశ్వరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించారు. 2025లో అనంత్ నాగ్ కీర్తి కిరీటంలో 'పద్మభూషణ్' చేరింది.




హాలీవుడ్‌లోకి 'మహారాజ'.. మొదటి తమిళ సినిమాగా

విజయ్ సేతుపతి (Vijay Sethupathi) ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'మహారాజ' (Maharaja). నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి.. ఆయన కెరీర్‌లోనే మంచి గుర్తింపు తెచ్చిన చిత్రంగా నిలిచిపోయింది. ఇప్పుడీ సినిమా హాలీవుడ్‌లో రీమేక్ కానుంది. ఎన్నో రోజులుగా దీనిపై వార్తలు వస్తున్నప్పటికీ తాజాగా హాలీవుడ్ నిర్మాణ సంస్థ 'ప్యాషన్ స్టూడియోస్' ఈసినిమాను రీమేక్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది (Maharaja Hollywood). దీనిని ఓ మైలురాయిగా పేర్కొన్న నిర్మాణ సంస్థ.. హాలీవుడ్‌లో రీమేక్ కానున్న మొదటి తమిళ సినిమాగా ఇది రికార్డు సాధించిందని తెలిపింది. ఇక 'మహారాజ' హాలీవుడ్ రీమేక్‌లో విజయ్ సేతుపతి పాత్రను ఆస్కార్ విన్నర్, స్టార్ హీరో మాథ్యూ (Matthew McConaughey) పోషించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్వరలోనే నటీనటుల వివరాలు వెల్లడించే అవకాశముంది. విజయ్ సేతుపతి 50వ చిత్రంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మహారాజ'.. ఆయనకు ఉత్తమ నటుడిగా పలు అవార్డులు తీసుకువచ్చింది. తమిళ, తెలుగు భాషలతో పాటు చైనాలో విడుదల చేయగా అక్కడ కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది.



'ఎల్లమ్మ' సినిమాలో హీరోయిన్‌గా 'రోమాంచకం' బ్యూటీ?

టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్‌లలో ఒకటైన 'ఎల్లమ్మ' (Yellamma) సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ వేణు ఎల్దండి దర్శకత్వంలో, రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రంలో హీరోయిన్‌గా యువ నటి అనంతిక సనిల్‌కుమార్ (Ananthika Sanilkumar) నటించబోతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ త్వరలోనే అధికారికంగా ప్రకటించబోతున్నట్లు సమాచారం. 'బలగం' వంటి ఎమోషనల్ అండ్ సక్సెస్ ఫుల్ సినిమా తర్వాత వేణు ఎల్దండి తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో నాయిక పాత్రకు తగినట్టుగా అనంతిక సనిల్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. నటనకు ఆస్కారం ఉన్న ఈ పాత్రలో ఆమె తన పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను మెప్పించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లను త్వరలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.



'హనుమాన్ అంశ్'.. తెలుగు విడుదలపై సందిగ్ధత!

ఇటీవల విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'హనుమాన్ అంశ్' (Hanuman Ansh) తెలుగు విడుదల వాయిదా పడనున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 18న ఈ సినిమాను తెలుగులో విడుదల చేయాలని ఏర్పాట్లు చేశారు. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా బాధ్యతలను తీసుకున్నట్లు కూడా ప్రకటించారు.

హైదరాబాద్‌లో సెప్టెంబర్ 15న జరగాల్సిన తెలుగు టీజర్ లాంచ్ ఈవెంట్ వాయిదా పడటంతో సినిమా విడుదలపై సందిగ్ధత నెలకొంది. కొన్ని కారణాలతో త్రివిక్రమ్ ఈ సినిమా నుంచి వైదొలిగారని.. దీంతో సినిమా విడుదల వాయిదా పడనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, త్రివిక్రమ్, చిత్ర యూనిట్ వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు (Hanuman Ansh Telugu Release). విడుదల తేదీ మార్పుపై కూడా నిర్మాతల నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో రూపొందిన హనుమాన్ అంశ్.. భారతదేశంలో ఇప్పటికే రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది.

విక్రమ్... 'పవర్ హౌస్'

విక్రమ్ ప్రధాన పాత్రలో 'చియాన్ 63' పేరుతో పట్టాలెక్కిన సినిమాకి 'పవర్ హౌస్' అనే టైటిల్‌ని అధికారికంగా ఖరారు చేసింది చిత్రబృందం. ఈ మేరకు సోమవారం ఇన్‌స్టాలో టైటిల్ అనౌన్స్‌మెంట్ ప్రోమోను విడుదల చేసింది. ఆనంద్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'సర్వం మాయ' ఫేమ్ రియా శిబు ఇందులో విక్రమ్‌కి మేనకోడలి పాత్రలో కనిపించనుంది. ఊర్వశి, వీటీవీ గణేశ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. టైటిల్ ప్రోమోలో కుటుంబంతో కలిసి క్యాటరింగ్ వ్యాపారం చేసుకునే సాధారణ వ్యక్తిగా అరటి గెలతో ఎంట్రీ ఇచ్చిన విక్రమ్.. చేసే ఏ పనైనా 'వందశాతం గ్యారెంటీ' ఇస్తానని చెప్పే డైలాగుతో ఆకట్టుకున్నారు. కుటుంబ నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని హాస్యానికి మాస్ అంశాలని మేళవించి రూపొందిస్తున్నట్టు స్పష్టమవుతుంది. వచ్చే ఏడాది ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.